Vol. II

No. 4

29th March, 1978
(Wednesday)
8 Chaitra, 1900 S.E.

# THE ANDHRA PRADESH
# Legislative Assembly Debates
## OFFICIAL REPORT

CONTENTS

| | Pages |
|---|---|
| **Condolence Motion:** | |
| re: On the demise of Sri Nivarthi Venkata Subbaiah, Chairman of the Andhra Pradesh Legislative Council | .. 195 |
| **Announcement:** | |
| re: Extention of time for withdrawal of Nomination to the three financial Committees | .. 223 |

PRINTED BY THE [illegible]

# THE
# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES
# OFFICIAL REPORT

---

Tenth Day of the First Session of the Andhra Pradesh Legislative Asssembly.

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Wednesday the 29th March, 1978.

The House met at Half-Past Eight of the Clock

(Mr. Speaker in the Chair)

## CONDOLENCE MOTION

On the demise of Sri Nivarthi Venkata Subbaiah,

Chairman of the Andhra Pradesh Legislative Council.

Mr. Speaker :—I now request the Leader of the House to move he Condolence Motion.

Dr. M. Chenna Reddy :—Sir, I beg to move :

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Nivarthi Venkata Subbaiah, Chairman of the Andhra Pradesh Legislative Council and conveys its deep sense of sympathy to the members of the bereaved family."

Mr. Speaker :—Motion moved.

డాక్టర్ ఎం. చెన్నారెడ్డి :—అధ్యక్షా, ఈ రోజు మన శాసనసభ చరిత్రలో అత్యంత విషాదకరమైన రోజుగా మనమంతా భావిస్తున్నాం. రెండు సభలూ జరుగుతూ వుండే సమయంలో విధానపరిషత్‌కు అధ్యక్షులుగా వుండే పెద్దలు శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్యగారు హఠాత్తుగా పరమపదించడం మనందరినీ, ఆంధ్రప్రదేశ్ ప్రజలందరినీ దుఃఖ సముద్రంలో ముంచిందని చెప్పడం అతిశయోక్తి కాదు. శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్యగారిని అందరూ చనువుగా 'నివర్తి' అని గుర్తుపెట్టుకుంటూవుంటారు. ఆ రోజు రాజకీయ స్వాతంత్ర్య పోరాటములో పని చేసినటువంటి గాంధేయులలో యిప్పటికి సజీవులుగా వుండే కొద్దిమందిలో ఆయన ఒకరుగా వుండేవారు. రెండు తరాలకు మధ్య ఒక మంచి, అనుబంధ

---

*An asterisk before the name indicates confirmation by the Member.

సంబంధం ఏర్పాటు చేసుకున్న మహావ్యక్తిగా వుండేవారు. ఆయన చూడడానికి ఏ విధంగా కనబడినప్పటికి, ఆయన వెనకాల ఒక బ్రహ్మాండమైన చరిత్ర వుంది. ఇప్పుడు ఆయనను చూస్తే నెమ్మదిగా కనబడుతున్నప్పటికి, విప్లవానికి, అండర్ గ్రౌండ్ మూవ్‌మెంట్‌కు, రాయలసీమలో, ఆ రోజుల్లో, స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిన పెద్దలలో ఒకరు మద్రాసులో పట్టభద్రులై, యీ రాజకీయ స్వాతంత్ర్యోద్యమానికి వచ్చి, ఎన్నో రకాలుగా సేవ చేశారు. టంగుటూరు ప్రకాశం పంతులుగారు నిర్వహిస్తూ వుండే స్వరాజ్య పత్రికకు ఉపసంపాదకులుగా వుండడం, యీ రోజున మనం వెనకకు తిరిగి చూస్తే ఆ రోజున ఎంతోమంది గొప్ప జర్నలిస్టులుగా పేరుపొందిన పెద్దలతో ఆయనకూడా పనిచేశారు. ఆ రంగము లోనే వారు గనుక కొనసాగివుంటే బహుశా ఎంతో ఉన్నతమైన స్థానం పొంది వుండేవారు. కాని, వారు అన్ని రంగాలలోనూ పాల్గొని, అన్ని విధాలుగా దేశానికి, రాష్ట్రానికి, ప్రత్యేకించి రాయలసీమకు వారు సేవ చేశారు. ఆయన అండర్ గ్రౌండ్‌లో వుండి పోరాటములో పాల్గొని పని చేస్తున్నప్పుడు ఆ రోజున వున్న బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను పట్టుకోవడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నం చేసిన విషయం మనకందరికి తెలుసు. కాని వారు దొరకకుండా తప్పించుకు తిరిగారు. తరువాత, సేవాగ్రాంలో గాంధీగారి సన్నిధిలో అక్కడ వారు కొంతకాలం వున్నారు, అప్పుడు గాంధీగారి ఆదేశం ప్రకారంగా వారు సరెండర్ అయినారు, అక్కడనే అరెస్టు అయినారు. మరొక సందర్భంలో వారిపై డెత్ సెంటెన్స్ కూడా వుండేది. ఆ విధంగా తీవ్రమైన పద్ధతిలో విప్లవించి పని చేసిన మహా మనీషి.

ఆయన రాయలసీమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి, ముఖ్యంగా సహకారోద్యమంలోను ఎన్నో రకాలుగా పని చేసినారు. నేను ఆయనతో కలిసి పనిచేసిన జ్ఞాపకాలు యీనాడు వస్తున్నవి. ఎస్టిమేట్స్ కమిటీ అధ్యక్షులుగా వున్నప్పుడు, నాకంటే వయసులో వారు పెద్దవారు అయినప్పటికీ, వారు సభ్యులుగా వుండి, ఎంతో ఉత్సాహంతో, ఎన్నో విషయాలు తెలుసుకోవాలనే ఆదుర్దాతో, హుషారుగా ఎస్టిమేట్స్ కమిటీ వ్యవహారాలలో పాల్గొని వారు పని చేసేవారు. ఈ రోజుకికూడా వారికి సహకారోద్యమంలో ఎంత ఆసక్తి వుందో చూస్తుంటే నాకు ఆశ్చర్యం కలుగుతుంది. వారి ఆరోగ్యం బాగాలేదు. అందరికి తెలుసు ఒకవైపు బి.పి; మరొకప్రక్క కిడ్నీ దెబ్బతిని వుంది. హార్టు ఎటాక్ కూడా యిదివరకు వచ్చింది వీటన్నింటినీ అధిగమించి, మంచి ఆరోగ్యం గలిగిన, వయసులో వున్న యువకుని ధోరణిలో విధానపరిషత్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వుండేవారు. అక్కడ ఎన్ని చిక్కులున్నాయో మీకు తెలుసు. అక్కడ ఎటువంటి పరిస్థితులు వుంటాయో, టెన్షన్ ఒక్కొక్కప్పుడు ఏ విధంగా ఏర్పడుతూ వుంటుందో మీకు తెలుసు అటువంటి పరిస్థితులలో కూడ కొంత హాస్యాన్ని మేళవించి, అందరినీ కలుపుకుని, సామరస్యంగా, ప్రశాంతాతనంతో నడిపిస్తూ వుండేవారు. ఆయనకు కోఆపరేటివ్ ఉద్యమంలో ఎంతో ఆసక్తి. నంద్యాలలోని

ఒక కో-ఆపరేటివ్ సొసైటీ సందర్భంగా మాట్లాడడానికి వారు స్వయంగా 8-40 a. m.
దయచేసి అందులో వారు ఎంతో ఆసక్తి చూపి చడం నాకు ఆశ్చర్యం కలిగించింది. విధానపరిషత్ సభ్యులు శ్రీ వేణుమాధవ్, ఆయన మిమిక్రీలో ఎంతో ప్రావీణ్యం గలవారు, 30 సంవత్సరాలనుంచి-వెనకటి హైదరాబాద్ రాష్ట్రంలో కూడ, అప్పటినుంచీ యీ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఈ మధ్య అంతర్జాతీయంగా కూడా ఖ్యాతి చెందారు. అనేక దేశాలకు వెళ్ళారు. పేరు సంపాదించారు. అటువంటి గౌరవ సభ్యుడిని ఆదరించాలని, గౌరవించాలని ఆయనకు ఎంతో పట్టుదల ఉండేది. మిమిక్రి మీద లిటరేచర్ లేదు మన భాషలోనే కాదు వేరే భాషలలో కూడ లేదు. దాని మీద పట్టుదలతో సూర్యనారాయణగారితో పుస్తకం వ్రాయించి నాతో విడుదల చేయించాలనే కార్యక్రమం వారు స్వయంగా పెట్టుకొన్నారు అందరికి కన్వీనియంటుగా ఉండే డేట్ ఏర్పాటు చేశారు. అది ఈ రోజు పెట్టవలసింది విధి వ్రాతలో ఆయన అందరి ముందు పోవాలని వ్రాసి వున్నది. చిత్రంగా ఈ రోజు కాకుండా నిన్ననే ఏర్పాటు చేయడం జరిగింది. భగవంతుడు అనే మాట నమ్మనటువంటి వారు చాల మంది ఉన్నారు. వారిలో కూడ మంచి వారు ఉన్నారు. దానిని ఎట్లా ఎక్స్‌ప్లెయిన్ చేయగలమో గాని మాట్లాడుతూ మాట్లాడుతూ వారు పడిపోయారు. విధి అనేది ఒకటి వున్నది. వారు పోయినటువంటి లోపాన్ని భరించుకొనడానికి ప్రయత్నంచేస్తూ ఉంటాము. స్పిరిచ్యువల్‌గా ఉండి ఈ శక్తిని ఈ విధంగా మనలోని మానవత్వాన్ని నిలబెట్టుకొని ఓపికతో సహనంతో బ్రతకడానికి అవకాశం కల్పిస్తూ ఉండేటటువంటి మహత్తరమైన శక్తి ఈ దేశంలో ఉంది. మీరు నేను ఒక ప్రక్క కూర్చుని మాట్లాడుతున్నటువంటి దృశ్యం చూస్తూ ఉన్నాము. స్వామి వివేకానంద, డా రాధాకృష్ణగారి పేర్లు పెట్టి దీర్ఘమైన ఉపన్యాసం చేస్తూ వేణుమాధవ్ గారి పేరు చెప్పి అనఫీషియల్ ఎంబాసిడర్ అని చెపుతూ యింకా ఎంతో దీర్ఘమైన ఉపన్యాసానికి కేవలం ఉపోద్ఘాతం జరిగింది. మన దేశానికి బ్రహ్మాండమైన అధ్యాత్మిక శక్తి, ఉన్నదని చెప్పి సజీవంగా ఉండి మాట్లాడుతున్నటువంటి వ్యక్తి యొక్క చావు నిముషం దాకా స్ఫురించని దృశ్యం మరువజాలనిది. ఆ నిముషంలో ఆయన చనిపోవడం జరిగింది అని చెప్పడం పొరపాటు. చివరి నిముషందాకా ప్రయత్నం చేయడం మానవ ధర్మం అని హాస్పటల్‌కు తీసుకుపోయారు. హాస్పటల్‌లో డాక్టర్స్ కావలసిన ప్రయత్నాలు చేశారు. కాని ప్రయత్నాలు ఫలించే అవకాశం లేదు. అప్పుడే ప్రాణం పోయింది. కాని ప్రయత్నం చేశాము. ఇంటికి తీసుకుపోవలసి వచ్చింది. వారి భార్యా పిల్లలు ఏడుస్తూ ఉండే దృశ్యం మరువ జాలము. చావు బ్రతుకు సహజంగా జరుగుతుంది. అది పెద్ద విషయం కాదు ప్రపంచంలో ఉండేదే. అయితే చావులోకూడ ఒక పద్ధతి అనుకుందాము. ఒక మంచి కార్యక్రమానికి పోయిన మనిషి ఈ విధంగా యింటికి తీసుకురాబడతాడు అని చెపితే భార్యా బిడ్డలకు వారి కుటుంబంతో పాటు మనకు కూడ ఎంతో దుఃఖకరమైన విషయం, వారి గౌరవార్థం ఈ రోజు

కార్యాలయాలన్నీ మూసివేయడం జరిగింది. ఫ్లాగ్ హాఫ్ మాస్ట్ పెట్టడం జరిగింది. ఉదయం 11½ గంటలకు స్టేట్ ఫ్యూనరల్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ హౌస్ ఈ దినం ఎడ్జర్న్ చేసి మన ప్రక్కన ఉండే హౌస్‌కు అధ్యక్షులుగా ఉండే వారి మరణానికి వారి కుటుంబ సభ్యులతో పాటు దుఃఖావస్థలో భాగస్వాములమై వారి కుటుంబం ఎడల గాఢమైన సంతాపాన్ని ప్రకటిస్తూ, వారి ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని పార్థిస్తూ ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నాను.

శ్రీ జి. లచ్చన్న (సోంపేట):—అధ్యక్షా, నివర్తి వెంకట సుబ్బయ్య గారు ధన్యజీవి అని చెప్పాలి. స్వతంత్ర పోరాట రంగంలో వారు నిర్వహించిన పాత్ర గురించి సభా నాయకులు, ముఖ్యమంత్రిగారు చాల విషయాలు తెలియజేశారు. రాజకీయ రంగమే కాదు, స్థానిక సేవారంగంలో కూడ విద్యాభివృద్ధి దేశంలో జరగాలని, విద్యాసంస్థలు నెలకొల్పి పత్రికా రచయితగా అన్ని రంగాలలో చిత్తశుద్ధితో, దీక్షతో పని చేసినటువంటి వ్యక్తులలో ఆయన ఒకరు అని మనవి చేయవలసివున్నది. వారితో పరిచయం అయినవారు ఎవరైనా వారిని విస్మరించడానికి వీలులేదు. ఎటువంటి పెద్దనాయకుల ఎదుట అయినాసరే అరమరికలు లేకుండా నిర్భయంగా వారి భావాలు ప్రకటించిన వ్యక్తులలో వారొకరు. తమకు కూడ తెలిసేవుంటుంది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉద్యమం జరుగుతున్నప్పుడు రాయలసీమకు ప్రత్యేక రక్షణ విషయములో, ప్రకాశంగారికి ఎంతటి భక్తి విశ్వాసాలు కలిగిన అనుచరుడు అయినప్పటికి, విశ్వాసపాత్రుడు అని చెప్పుకొన్నప్పటికి, రాష్ట్ర కాంగ్రెస్ సమావేశాలలో, ప్రత్యేక సమావేశాలలో నిర్భయంగా తమయొక్క భావాన్ని ప్రకటిస్తూ రాయలసీమకు ఆర్థిక సాంఘిక అభివృద్ధి గురించి పనిచేసిన పెద్దలలో ఒకరు అని మనం తప్పకుండా చెప్పవలసివున్నది. శాసనమండలిలోనకూడ సహృదయంతో సత్ సాంప్రదాయాన్ని ఏర్పాటుచేసి అన్ని పక్షాలయొక్క మన్ననలను, విశ్వాసాన్ని చూరగొన్న వ్యక్తి. ఆంధ్రప్రదేశ్ ఒక ఉత్తమమైన పుత్రుడిని కోల్పోయిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. సాంఘికంగా చూస్తే విజ్ఞానం కలిగినటువంటి ఉత్తమ కుటుంబంలో పుట్టినప్పటికి, ఆర్థికంగా సామాన్యమైన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. తనయొక్క విజ్ఞానాన్ని, తనయొక్క సర్వస్వాన్ని దేశ స్వాతంత్ర్య పోరాటానికి అంకితం చేసిన వ్యక్తులలో ఒకరు. ముఖ్యంగా మనం గమనించవలసింది, వారికి రాజకీయంగా ప్రముఖ స్థానం వచ్చి గుర్తింపు వచ్చినది అంటే వారియొక్క నిష్కల్మషమైన, నిస్వార్థమైన దేశ భక్తుడుగా ప్రజా సేవ ద్వారానే వచ్చినదని మనవిచేస్తున్నాను. రాజకీయ ఉన్నత స్థానం లభించినప్పుడు ఆ ఉన్నత స్థానాన్ని కాపాడుకోవడంలో దీక్ష చూపించారు తప్ప దానిని దుర్వినియోగం చేశారని చెప్పడానికి ఎలాంటి ఆస్కారం లేనటువంటి వ్యక్తి. శాసనసభయొక్క సాంప్రదాయాలలోను, ప్రజాస్వామ్య ఆశయాలపట్ల ప్రగాఢమైన భక్తి విశ్వాసాలు కలిగిన వ్యక్తి. అటువంటివారు మననుండి పోవడం తీరని లోటు అని

చెప్పవలసివుంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సభా నాయకులు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని జనతాపార్టీ తరఫున, నా తరఫున బలపరుస్తూ 8-50 a.m. వారి కుటుంబానికి మా సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. శ్రీరామమూర్తి (పరవాడ) :—అధ్యక్షా, పూజ్యులు నివర్తి వెంకట సుబ్బయ్యగారు స్వర్గస్థులై మనలందరిని దుఃఖసాగరములో ముంచారు. ఎంతో గొప్పవారికిగాని సిద్ధించని అనాయాస మరణం పొందారు. ఆఖరుక్షణం వరకు తన విధి నిర్వహణలో నిమగ్నులై ఉన్నారు. నిన్నటిరోజున మరీ ఉల్లాసంగా ఉత్సాహముగా ఛలోక్తులు ఆడుతూ శాసనమండలి కార్యక్రమాలను జయప్రదంగా నడిపించారు. సభా నాయకులు చెప్పినట్లు, సాయంకాలం చాలా చక్కని గంభీరమైన ఉపన్యాసంలో నిమగ్నులయి ఉన్నారు. అటువంటి సందర్భంలో హఠాన్మరణం సంభవించింది. తుది క్షణంవరకు తన జీవితాన్ని ఉన్నత లక్ష్యంకోసం వినియోగించి అందుకే అంకితం చేసిన మహానుభావుడు. మహా మనీషి. నిష్కళంకమైన జాతీయవాది, స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయవాది. ఎప్పుడు కౌన్సిలులోనికి వచ్చినప్పటికి ఎదురుగా వున్న మహాత్మా గాంధీకి దణ్ణం పెట్టకుండా కుర్చీలో కూర్చునేవాడు కాదు. అది ఆయన తాలూకు సాంప్రదాయం. మిన్ను విరిగి మీద పడినప్పటికి చలించేవాడు కాదు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ గంభీరంగా, ప్రశాంతంగా శాసనమండలి కార్యక్రమాలను ఎంతో హుందాగా నిండుగా నిబ్బరముగా నడిపించేవారు. ఇది ఆయన తాలూకు ప్రత్యేకత. ఆయన అందరి అభిమానాన్ని చూరగొన్నారు. ఆయనలో అణువు అణువునా, అడుగు అడుగునా మంచితనం ఉట్టిపడుతూండేది. నిర్మలత్వం, నిరాడంబరత్వం ఉట్టిపడేది, నిష్కళంకమైన దేశభక్తుడు, జాతీయవాది. ఎంతో ప్రేమతో వాత్సల్యంతో చూసేవారు, ఎంతో అభిమానంతో పలకరించేవారు. సంసారం గురించి, కష్టసుఖాలు గురించి ప్రశ్నిస్తూనే ఉండేవారు. కేవలం అధికార హోదాలో ఏమి చేస్తున్నామని కాక వ్యక్తిగతంగా మనుష్యుల మనస్సులను కలుపుకుని తన మనస్సును అప్పగించే పద్ధతి గొప్పది. ఆయన విద్యావేత్త. విద్యారంగంలో అనేక కార్యక్రమాలు గురించి తహతహపడి కృషిచేసినవారు, ఆయన పత్రికా రచయిత, గ్రంథకర్త, వక్త, విద్యావేత్త. ఏ రకంగా చూసినప్పటికి శాసనసభా కార్యక్రమాలలో వారికి ఉన్న అనుభవం చాలా గొప్పది. నిర్మాణ కార్యకర్త, స్వాతంత్ర్య సమర యోధుడు. మహాత్మాగాంధీ యుగంలోనివారి కోవకు చెందిన మనుష్యులు అరుదైపోతున్న తరుణంలో ఆఖరు వ్యక్తా అన్నట్లు మనముందు తిరుగుతున్న మనిషి అదృశ్యమయినారు. మన దురదృష్టం. ఈ రాష్ట్రానికి తీరని లోటు. ఉభయ సభలూ మరువరాని విషాద ఘట్టం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నాను. సభా నాయకులు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ సి హెచ్. రాజేశ్వరరావు (సిరిసిల్ల) :—అధ్యక్షా, కీర్తిశేషులైన నివర్తి వెంకటసుబ్బయ్యగారి మరణంపట్ల మనం ఇంత తొందరగా సంతాపం వెలిబుచ్చవలసి వస్తుందని ఎవరమూ ఊహించలేదు. మన సభానాయకులు చెప్పినట్లు, ఈ నాడు మనకు దుఃఖదినం. స్వతంత్ర పోరాట యుగానికి నేటి తరానికీ మధ్య వంతెనగా నిలిచిన పెద్దమనిషి. గత పోరాట సాంప్రదాయాలను, మన దేశ సంస్కృతీ సాంప్రదాయాలను ఆధునిక సాంప్రదాయాలతో కర్తవ్యాలతో బాధ్యతలతో మేళవింపు చేసి క్రొత్త త్రోవను చూపిస్తున్న పెద్ద మనిషి. శాసనమండలి కార్యక్రమాలను సమర్థతతో నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటి. మృత్యువును ఎవరూ జయించలేరు. ఏ సిద్ధాంతానికి అంకితమైనప్పటికీ, భగవంతుని నమ్మినా నమ్మకపోయినా, అందరికి అతీతమయినది మరణం. దానిని అరికట్టగలిగిన శక్తి ఏ ఒక్క సిద్ధాంతానికి, మానవునికి లేదనేది పరమ సత్యం. ఇటువంటి పరిస్థితులలో సునాయాస మరణం పొంది ఆయన చేయవలసిన సేవ ఎంతో ఉండగా మన మధ్య లేకుండా ఉన్నందుకు మనం బాధపడుతున్నాము. సభా నాయకులు వెలిబుచ్చిన హృదయ విదారకమైన భావాలతో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున మేముకూడ భాగస్వాములుగా ఉంటూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబానికి మా హృదయపూర్వకమైన ప్రగాఢమైన సానుభూతి తెలియజేస్తున్నాను.

శ్రీ ఎమ్. ఓంకార్ (నరసంపేట) :—అధ్యక్షా, నివర్తి వెంకటసుబ్బయ్యగారి అకాల మరణానికి సంతాపాన్ని తెలుపుతూ సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. శ్రీ వెంకటసుబ్బయ్యగారు ప్రముఖ జాతీయవాది. గొప్ప దేశభక్తులలో ఒకరు. వారు శాసనమండలికి అధ్యక్షులుగా ఉంటూ నడిపించిన పద్ధతి గమనించిన వారెవరికయినా గొప్ప హుందాతనము కనిపిస్తుంది. ఎంతో నైపుణ్యం కనిపిస్తుంది. ప్రజలకు సంబంధించిన ఏ సమస్యనైనా మంత్రులు దాటవేయడానికి ప్రయత్నించినప్పటికి అది రంగా దాటవేయకుండా దాని నిగ్గు తేల్చేవారు. సమస్యలను ప్రతిఘటించే సభ్యులకు సరయిన అవకాశం యిచ్చేవారు. దేశ ప్రజలకు లాభం చేకూరాలని వారు నడిపిన కార్యక్రమాలు చాలా ఆదర్శనీయమయినవి. ఆయన గొప్ప విద్యావేత్తమాత్రమే కాక కళా ప్రియుడుకూడా. ఆయన విదేశ పర్యటన జరిపినప్పుడు ఈ అనుభవం ఎంతో ఉపయుక్తమైనది. ఇటువంటి ప్రముఖ జాతీయవాదిని కోల్పోవడం మొత్తం దేశానికి తీరని లోటు. ప్రకృతిలో ఇంకా మానవునికి తెలియనిరహస్యాలు ఎన్నో ఉన్నాయి. మానవసమాజం శాశ్వతంగా ఉండేది. కాలక్రమేణా మానవుడు తన శ్రమ ద్వారా మానవజాతి సంక్షేమానికి ప్రకృతిలోని నిగూఢ రహస్యాలను తెలుసుకోగలుగుతాడనే నమ్మకం నాకు ఉంది. ఈరోజున మనం నివారణను ఊహించలేని జబ్బులకు ఆకస్మికంగా వచ్చే మరణాలకు మానవజాతి ప్రకృతి రహస్యాలను ఛేదించి నివారణోపాయాలు తప్పనిసరిగా కనుక్కుంటుందనే ప్రగాఢ విశ్వాసం నాకు వుంది.

9-00 a. m.

ఏమైనప్పటికీ మనం ఒక ప్రముఖ జాతీయవాదిని, దేశభక్తుడుని కోల్పోవడం మన అందరి దురదృష్టం ఈ సందర్భంలో గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ వారి మరణానికి వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తపరస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (వెంకటగిరి) :—అధ్యక్షా, మనం ఈనాడు ఒక స్వాతంత్ర్య సమర యోధుని, దేశభక్తుని కోల్పోయినాము. వారి హఠాన్మరణానికి ప్రత్యక్ష సాక్షులలో నేనొకడిని. నిన్న సాయంకాలము వారు శ్రీ వేణుమాధవ్ గారి సన్మానసభకు అధ్యక్ష స్థానంలో ఉన్నారు. సభ ప్రారంభం అయింది. శ్రీ వీరమాచనేని వెంకటనారాయణగారు స్వాగతం పలికారు. వెంకటసుబ్బయ్య గారు మాట్లాడడానికి వచ్చారు. ఎంతో ఉత్సాహంతో వారి ఉపన్యాసం ప్రారంభమయింది మన దేశాన్నిగురించి మూడు సెంటెన్సులు బ్రహ్మాండంగా చెప్పారు రాధాకృష్ణన్‌గారి గురించి చెప్పారు. వేణుమాధవ్‌గారి దగ్గరికి వచ్చారు. అంతలోనే ఒక్క క్షణంలో వెనక్కు పడిపోవడం జరిగింది. అక్కడినుంచి దొర్లిపడడం జరిగింది. నిన్నటి సన్మానసభ వారి వీడ్కోలు సభగా మారిపోయింది. నిండు పేరోలగములో వారి వీడ్కోలు జరిగింది. అది వారు చేసినటువంటి సేవకు దేవుడు నిర్ణయించిన నిర్ణయం అని చెప్పాలి. వారి భౌతిక కాయం ఖననం కాకముందే ఈ రెండు శాసన సభలలోను మనం వారి మరణానికి సంతాపాన్ని తెల్పుగల్గడం వారి దేశ సేవకు ప్రతీక అని చెప్పాలి. ఇది దైవ నిర్ణయం అని చెప్పాలి. వారి సేవకు ప్రతిఫలం అనాలి నీతికి నిజాయితీకి ఫలితమే ఇది అని చెప్పాలి 1958 లో గ్రాడ్యుయేట్స్ కాన్‌స్టిట్యుయన్సీనుంచి వారు కౌన్సిల్‌కి ఎన్నిక అయినారు రాష్ట్రానికే కాకుండా దేశానికే సేవ చేసినటువంటి వ్యక్తి వారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తి. వారి మరణం దేశానికి పెద్ద లోటని మనవి చేస్తున్నాను. వారి మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కల్గించాలని భగవంతుని ప్రార్థిస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ పాలడుగు వెంకటరావు (నూజివీడు) :—అధ్యక్షా, నివర్తి వెంకట సుబ్బయ్యగారి అకాల మరణం రాష్ట్ర ప్రజలందరికి దిగ్భ్రాంతిని కలుగజేసింది. ఆయన సామాన్య మానవుడు కాదు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని నవభారత నిర్మాణములోకూడా ఆయన పాల్గొని, ప్రజల మధ్యనుండి దేశ సేవ చేసిన ఆయన యిట్లా చనిపోవడం అదృష్టం. మనకుకూడా అదృష్టం. ఇంత మంచి వాడు, రాజకీయాలలో యింత నీతి నిజాయితీ కలిగిన వ్యక్తి అకాల మరణం చెందడం వారికీ, మనకీకూడా ఒకరకంగా మంచిదే. వారు అనేక క్లిష్ట సమస్యలలో యీ కౌన్సిలును నడపడం జరిగింది. నేను 4 సంవత్సరాలపాటు శాసన మండలి సభ్యుడుగా ఉండడం జరిగింది. ఎంతో నేర్పుతో, ఓర్పుతో అందరు సభ్యులను కూర్చోబెట్టారు ఎంత క్లిష్ట సమస్యలు వచ్చినా కూడా జన్ని

రాజకీయ పార్టీల కార్యకర్తలను సమాధానపరిచేవారు. ఎవరు ఎంత ఇబ్బంది పెట్టినా కూడా బయటకు వచ్చిన తరువాత వారితో మంచిమాటలు చెబుతూ ఉండేవారు. ఇట్లాంటి శాసనమండలి అధ్యక్షులు మళ్ళీ మనకు దొరకుతారా అన్నది సమస్య. ముఖ్యంగా ఆయన రాయలసీమ ప్రజలకు చేసిన సేవ గాని రాయల సీమ అభివృద్ధికి వారు పడినటువంటి తహతహ గాని సామాన్యమైనది కాదు. నిజంగా వారి ఆత్మకు శాంతి కలుగజేయాలి అంటే వారు తహ తహ పడిన విధంగానే రాయలసీమను అభివృద్ధి చేయాలి. రాయలసీమ అభివృద్ధిచెందితేనే వారి ఆత్మకు శాంతి కలుగుతుంది. వారి అకాల మరణానికి వారి కుటుంబానికి నా హృదయపూర్వక విచారాన్ని తెలియజేస్తూ శలవుతీసుకుంటున్నాను.

శ్రీ కె. వెంకట్రామయ్య (గుత్తి) :— అధ్యక్షా, ఈ రోజు ది డే ఆఫ్ జడ్జిమెంటు. నివర్తి వెంకటసుబ్బయ్యగారితో నాకు 38 సంవత్సరాల పరిచయం ఉంది. ఆయన మరపురాని మనిషి. ఆయన రాయలసీమకు చేసినటువంటి మేలుగాని, సేవ గాని ఒక్కమాటలో తెల్పలేము. ముఖ్యంగా వారు శ్రీబాగ్ ఒడంబడిక రూపు దాల్చడంలో కృషిచేసిన వారిలో ఒకరు అగ్రగణ్యుడు. దేశం కోసం, స్వాతంత్ర్యం కోసం జైలుకి వెళ్ళినటువంటి మహాపురుషుడు, సన్ ఆఫ్ ఇండియా. ఫ్రీడమ్ ఫైటర్స్‌కి సహాయం చేస్తే బాగుంటుంది అనేవాళ్ళలో ఆయన ఒకరు. ఫ్రీడమ్ ఫైటర్స్‌కి సహాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. వెంగళరావుగారి ప్రభుత్వంలో జరగలేదు. 1942లో జైలుకి వెళ్ళిన ఫ్రీడమ్ ఫైటర్స్‌కి సహాయం చేయాలి. వారి పీరియడ్‌ని లెక్కపెట్టకుండా ఎవరైతే స్వాతంత్ర్యం కోసం, దేశం కోసం పాటుపడినవారో వారికి పొలిటికల్ పెన్షన్ ఈ అసెంబ్లీలోనైనా ఇస్తే బాగుంటుంది. వారు రాయలసీమ కోసం, రాయల సీమ అభివృద్ధికోసం చాల పాటు పడినారు. 1940లో నంద్యాలలో కాన్ఫరెన్సు జరిగింది. నాకు 14 సంవత్సరాల వయస్సు. వారి ఆత్మకు శాంతికలగాలి అంటే రాయలసీమను అభివృద్ధి పరచాలి. మరణం ఎవరూ చెప్పలేరు. దైవనిర్ణయానికి తల ఒగ్గవలసిందే. వారి ఆత్మకు శాంతికలగాలని నేను కోరుకుంటున్నాను.

శ్రీ డి. కె. సత్యారెడ్డి (గద్వాల్) :— అధ్యక్షా, వారు 1942లో కార్యక్రమాలలో ఎన్నో కష్టాలను గుండె నిబ్బరముతో సహించారు. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్య లేకుండా పోవడం చాల దురదృష్టం. పుటిన వారికి గిట్టక తప్పదు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వీరి పేరు సువర్ణాక్షరాలతో వ్రాయవలసిన అవసరం ఉన్నది. వారికి నా కృతజ్ఞతలు తెలుపుతూ వారి మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ, వారి ఆత్మకు శాంతిని ఇవ్వాలని కోరుతూ ఉన్నాను.

శ్రీ సి. దాసు :— అధ్యక్షా, శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్యగారి అకాల మరణానికి గాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. వారికి నాకు మధ్య సుమారు 35 సంవత్సరాల పరిచయం ఉంది, వారెంతో విజ్ఞానం కలవారు. పత్రికా రంగం లోనూ, రాజకీయ రంగంలోనూ చాలా గొప్పవారు చాలా ఏళ్లు స్వరాజ్యానికి

పోరాటం చేసి జైలుకు వెళ్ళిన వారు. రాష్ట్రంలోను, ముఖ్యంగా మా రాయలసీమలో, ఆయన పెద్ద నాయకులు. రాయలసీమ ప్రజలు గొప్ప నాయకుణ్ణి పోగొట్టుకున్నారు వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికై రాయలసీమ మహాసభలు ఏర్పాటు చేసారు. అనంతపురంలోను, ప్రొద్దుటూరులోను, నంద్యాలలోను, మద్రాసులోను కూడా రాయలసీమ మహాసభలు ఏర్పాటు చేసారు. హరిసర్వోత్తమ రావుగారి ఆధ్వర్యంలో, ఆయన ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఉంటూ రాయలసీమ అభివృద్ధికి ఎంతో కృషి చేసారు. వెంకట్రామయ్యగారు చెప్పినట్లుగా, శ్రీబాగ్ ఒడంబడిక ద్వారా రాయలసీమ అభివృద్ధికి కృషిచేసిన వారిలో వెంకట సుబ్బయ్య గారు మొదటివారు. వారు ఈ రోజున స్వర్గస్థులైనప్పటికి వారు చేసిన సేవను రాయలసీమ ప్రజలు ఎప్పటికి మరచిపోవడానికి లేదని మనవిచేస్తున్నాను. ఎంతో మెత్తదనంగా ఉండే వారి ఉపన్యాసం నిన్నటి రోజున మాకందరికి చాలా ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది. హైందవ సాంప్రదాయం గురించి వేణు మాధవ్ గారు ఇతర దేశాలలో పొందిన కీర్తిప్రతిష్టలు గురించి, ఆ విధంగా కీర్తి పొందిన స్వామి వివేకానంద, రాధాకృష్ణన్ గురించి చెబుతూ ఆకస్మికంగా మరణించడం జరిగింది. వారు లేని లోటు మనం భరించలేనిది వారి మరణానికి నేను గాఢమైన సంతాపం తెలియచేస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను.

శ్రీ డి. మునిస్వామి (కొడుమూరు) :—అధ్యక్షా, శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్యగారి అకాల మరణానికి సానుభూతిని తెలుపుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారు మా కర్నూలుజిల్లా నుంచి వచ్చిన వారు మాత్రమే కాకుండా మా రాయలసీమ జిల్లాలలో పేరు పొందిన రాజకీయ వేత్త, నాయకుడు. వారు కర్నూలుజిల్లా కాంగ్రెసు అధ్యక్షులుగా చాలా సంవత్సరాలు ఉంటూ మాలాంటి యువకులను కాంగ్రెసులో చేర్పించి సోషల్ సర్వీసు లీగ్ వంటి ఇతర సంస్థలలో మాకు అవకాశం కల్పించి మాకు ఒక విధంగా రాజకీయ గురువుగా ప్రవర్తించిన వారు; నేను మొట్టమొదట 1972లో శాసన సభకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి ఎంతో కృషి చేసిన మహానుభావులు వారు. ఏకగ్రీవంగా ఎన్నికై శాసన సభకు వచ్చిన తరువాత శాసన మండలిలో జరిగే కార్యకలాపాలకు సంబంధించి ఒక విధంగా పాఠం చెప్పిన వారు వెంకట సుబ్బయ్యగారు. ఈ రోజున వారు మన మధ్య లేకుండా పోవడం తీరని లోటు. మరొక సారి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

منسٹر فار ویمن ولفیر ( شریمتی روڈا میستری ) :— صدر صاحب یہ عام کہاوت ہے کہ انسان دنیا میں جتنے دن بھی رہتا ہے وہ اپنی زندگی کشمکش میں گذارتا ہے اور وہ دنیا سے گذرتے وقت اپنے ساتھ سوائے اپنی نیکیوں اور اچھائیوں کے کچھ نہیں لے جاتا۔ شری ین۔ وینکٹ سبیا صاحب کی زندگی بھی اسی

کہاوت کا نمونہ ہے۔ وہ ایک اچھے اور رحم دل انسان تھے ۔ ان کی زندگی اور انکے اوصاف کے بارے میں بیان کرنا میرے لئے مشکل ہے۔ میں صرف اتنا کہنا چاہتی ہوں کہ خدا ان کو کے ارکان خاندان کو ان کی جدائی کا غم برداشت کرنے کی طاقت عطا فرمائے ۔ میں دعا کرتی ہوں کہ اللہ مرحوم کو بارگاہ الہی میں باریاب کرے ۔

*Sri H. Satyanarayana (Adoni):—Mr. Speaker, Sir, I rise with a deep sense of sorrow at the demise of my political guru, friend, phylosopher and guide My association with him is for the last 20 or 25 years and more close from the time of the formation of fhe State of the Andhra Pradesh. In those days of freedom struggle, we were in Bellari district in the Karnataka State.

I was one of those people who was drawn into the freedom struggle by the examples set up by Sri N. Venkatasubbaiah, late Kalluri Subba Rao and P. Ramacharyulu. It is not an exaggeration to say that these are the main trio in the freedom struggle. One word about Mr. Nivarthi is that as a freedom fighter, his services to the country and especially to Rayalaseema are very great. As Chairman of the Rayalassema Development Board, he tried his best to develop the Rayalaseema area. His pet subject was diversion of Krishna waters for irrigation to Rayolaseema. It would be in fitness of things and a fiiting monument if the Government of Audhra Pradesh would see that Krishna waters are given for irrigation to Rayalaseema, because he was always been referring to Krishna waters coming to Mittu Kandala deep cut, etc.

I request the Chief Minister to see that the Krishna waters are diverted to Rayalascema. If it is fulifilled, his soul will rest in peace, because he was fighting for it for the last 25 years. It is hoped that this matter will draw the attention of the Government.

Finally, I wish to convey my heart-felt condolences to the bereaved family. When I went to his residence yesterday, when his family members saw me, there was an upsurage of feelings which I could not control and bear and I have to come back, Sir. I pray may his soul rest in peace at Haven. Thank you, Sir.

9-20 a. m. శ్రీ వి. శివరామకృష్ణరావు (బద్వేల్):—అధ్యక్షా, నిన్నటి వరకూ మన కళ్లెదుట సజీవంగా వున్న నివర్తి వెంకట సుబ్బయ్యగారు ఈనాడు లేకపోవడం చాలా విచారకరమైన విషయం. నిన్నసాయంకాలం మనమందరం వేణుమాధవ్ గారి

సన్మానసభలో వున్నాము. చూస్తూ చూస్తూవుండగానే వెంకటసుబ్బయ్య గారు పడిపోవడం, పడిపోయిన వెంటనే చనిపోవడం జరిగింది. హాస్పిటల్‌లో చేర్చినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయనతో నాకు గత అయిదు సంవత్సరాల పరిచయం వుంది. వారికి మా తండ్రిగారు చాలా సన్నిహితులు, అందువల్ల వారి కుటుంబంతో మాకు సంబంధం వుంది వారి మరణానికి నా సంతాపం తెలియ జేస్తూ వారి కుటుంబానికి నా సానుభూతి తెలియచేస్తూ, వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలుగచేయాలని ప్రార్థిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలుగాలంటే సత్వరం కృష్ణానదీ జలాలను రాయలసీమకు ఇవ్వటానికి ముఖ్యమంత్రిగారు ప్రయత్నించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. అప్పారావు (రామచంద్రాపురం):—అధ్యక్షా, వెంకట సుబ్బయ్యగారి మరణంవల్ల ఘోరమైన విపత్తు పరిస్థితి ఏర్పడింది. వారు రాజనీతి వేత్త, అమృతలత రాజకీయవాది, విషలత ఈ రెండు కోవలలో వారు మొదటి కోవకు చెందినవారు. తన ధన, రక్త మాంసాలు ప్రజలకు పంచిపెట్టి, తనకు వచ్చిన కష్టాలను ఓర్చుకొని దిగమింగేవాడు రాజనీతి వేత్త, అమృత లత. సమాజం యొక్క రక్త మాంసాలు పీల్చి, కనికరం లేకుండా, అభిమానం, మానవతాగుణం ఏ రూపంలోనూ లేకుండా నూటికి నూరుపాళ్ళు వ్యక్తి స్వార్థంతో సంచరించే వ్యక్తి రాజకీయవాది, విషలత. వెంకటసుబ్బయ్యగారు రాజనీతి వేత్త, అమృత లత కోవకు చెందిన వారని చెబుతూ వారి కుటుంబానికి నా నియోజకవర్గం తరఫున నా సానుభూతి తెలియచేస్తూ భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

* శ్రీ హనుమంతరెడ్డి (ఎమ్మిగనూరు) :—అధ్యక్షా, వెంకటసుబ్బయ్యగారు, నేను పత్తికొండ తాలూకాలో జన్మించినా వారు నంద్యాలలో నేను ఎమ్మిగనూరులో స్థిరపడ్డాము. వారు మొన్న నగసప్పగారు ఇచ్చిన డిన్నర్‌కు వచ్చి చాలా సంతోషంగా మాట్లాడారు. వారి ఆకస్మిక మరణం దిగ్భ్రాంతి కల్గించింది. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తూ భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని ప్రార్థిస్తున్నాను.

شری محمد امان اللہ خان :— (چندرائن گٹہ)

جناب اسپیکر صاحب - دنیا میں جو بھی انسان پیدا ہوتا ہے اسکے کیلئے موت ضروری ہے۔ دنیا میں لوگ پیدا ہوتے ہیں اور مرتے ہیں، اسکا غم صرف ان ہی ارکان خاندان کو ہوتا ہے۔ لیکن بعض اموات ایسی ہوتی ہیں جن کا غم ارکان خاندان کے علاوہ سارے ملک کو بھی ہوتا ہے۔ اور ہر تڑپنے والا دل ان کی موت پر تڑپ اٹھتا ہے، کل ہی شام میں - میں نے سنا کہ ونکٹ سبیا صاحب کا انتقال ہوا ہے۔ وہ ایک ممتاز مجاہد آزادی اور پارلیمنٹرین تھے۔ میں اور میری

پارٹی ان کے ارکان خاندان کے غم میں شریک ہیں اور دعا کرتے ہیں کہ اللہ تعالی ان کے ارکان خاندان کو صبر جمیل عطا سرمائے ۔

శ్రీ ఎ. వీరప్ప (నల్లమడ):— అధ్యక్షా, సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. నివర్తి వెంకట సుబ్బయ్యగారి గురించి చెప్పాలంటే ఒక్కమాటలో చెప్పవచ్చు. మనిషి బ్రతికిన బ్రతుకు అంతా చావులో తెలుస్తుంది అని పెద్దలు అంటారు. వారి మరణం వారి జీవితాన్ని గురించి చెబుతుంది. కౌన్సిల్ ఛైర్మన్‌గా వుంటూ అంతవరకూ సభకు అధ్యక్షత వహించి, ఆ పిదప వేణుమాధవ్ సన్మానసభకు అధ్యక్షత స్థానం వహించి ఒక మహాభక్తుని గురించి ఉపన్యసిస్తూ, హైందవ ధర్మ ప్రచారం గురించి బోధిస్తూ. ఆయన అనుచరుల మధ్య సన్నిహితులమధ్య, శాసనసభ్యుల సమక్షంలో, ముఖ్యమంత్రిగారు కూడా అక్కడ వుండగానే, ఈ సభాధ్యక్షులు కూడా అక్కడ వున్నప్పుడే వీరందరి సమక్షంలో వారి మరణం వారికి తెలిసి అందరనూ పిలిపించు కున్నట్లుగా అక్కడికక్కడే మరణించారు. అందరూ మరణిస్తారు కాని వీరి మరణం ప్రత్యేకంగా కన్పిస్తున్నది వారి సేవ, వారి మంచితనం ఎవరూ మర్చిపోలేనిది. వారి మరణం రాయలసీమకు తీరనిలోటు. ఎప్పుడు రాయలసీమ కార్యక్రమాలపైన, రాయలసీమ ఇబ్బందుల పైన రాయలసీమ కరువుకాటకాలపైన అనేక పథకాలు తయారుచేస్తూ ఇందిరాగాంధి వచ్చినప్పుడు వారికి సమర్పించడం జరిగింది అనేకసార్లు వాటి కోసం ఎంతగానో ప్రయత్నాలు చేశారు. వారి మరణం మాకు తీరని లోటు అని చెబుతూ వారి కుటుంబానికి నా సానుభూతి తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ పి. సుబ్బయ్య(మార్కాపురం):—అధ్యక్షా, నాకు వెంకటసుబ్బయ్యగారితో చాలా సంవత్సరాలుగా పరిచయం వుంది వారు స్వాతంత్ర్యయోధులు, ప్రముఖ జాతీయవాది, మేధావులు, సహృదయులు,పాత కొత్తల కలయికకు ప్రతీక. అటువంటివారు మనమధ్య లేకుండా వెళ్ళిపోయారు. మొరార్జి దేశాయి గారు డెప్యూటి ప్రధానమంత్రిగా వున్నప్పుడు రాయలసీమ కరువును చూసి నిర్దిష్ట కార్యక్రమాలను చేపట్టటానికి వారు వచ్చినప్పుడు వెంకటసుబ్బయ్యగారు ఒక చిన్న పుస్తకం ఇంగ్లీషులో ప్రచురించినారు. అందులో రాయలసీమ సమస్యలన్ని సూచించారు. వారు సూచించిన సమస్యలన్నిటిని పరిష్కరిస్తే రాయలసీమ పరిపూర్తి అయిన, నిండైన ప్రాంతంగా వుంటుందని వారు తెలిపారు. దానిలో అన్నికూడ నీటిని యివ్వడం, పరిశ్రమలు యివ్వడం దానిని ఎలా ప్రత్యేక
9-30 a.m. దృష్టితో చూడాలనేది వుంది. అది శాశ్వితంగా రాయలసీమ సమస్యల మీద వుండే పుస్తకము వారు రాయలసీమ బోర్డు ఛైర్మన్‌గా వున్నప్పుడు నేను ఎగ్జిక్యూటివ్ మెంబరుగా వున్నాను. వారితో సమస్యలు చర్చించినప్పుడు తెలిసేది. వారు సమస్యలను సృజనాత్మకంగా రేకెత్తించే శక్తి కలిగినవారు. సమస్యలకు

పరిష్కార మార్గము చెప్పగలరు. అంతటి సునిశితమైన మేధావి. శాసనమండలి కార్యక్రమాలలో వారు యిచ్చినటువంటి రూలింగ్సు చాల గొప్పవిగా చెప్పుకుంటున్నారు అవి మంచి రూలింగ్సుగా నిలిచి పోతాయని అంటున్నారు. నేను ఎన్నికఅయిన సందర్భములో నాకొ కంగ్రాచ్యులేషన్సు లెటరు పంపుతూ అందులో, ప్రొద్దుటూరు రాయలసీమ మహాసభలో కొన్ని తీర్మానాలు చేశాము, ఆ తీర్మానాలు నెరవేరడానికి మీలాంటివారు గెలవడం రీత్యా న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు. అది నా హృదయాన్ని చలింపజేస్తున్నది. వారు దేనికి అయితే అంకితం అయ్యారో దానిని నెరవేర్చాలని అకుంఠిత దీక్షతో పని చేశారు. అందువల్ల వెంకటసుబ్బయ్య గారి మరణం రాయలసీమకే గాదు, రాష్ట్రానికే గాదు మొత్తం దేశానికే తీరని లోటు. వారు మరణించే సమయంలో వారు చేసి నటువంటి ఉపన్యాసము చక్కటి నిదర్శనము. భారత దేశ సాంస్కృతిక సంబంధాల గురించి ముచ్చటిస్తూ వివేకానంద, డాక్టరు రాధాకృష్ణలగురించి ప్రస్తావిసూ మరణించారంటే అది ఆయన గొప్ప పాండిత్యానికి చక్కటి గీటురాయి అటువంటివారు పోవడం నిజంగా రాష్ట్రానికి దురదృష్టము. వారు లేని లోటు తీర్చలేము. వారు దేనికైతే అంకితం అయ్యారో దానిని నెరవేర్చడానికి కృషి చేయడమే వారికి యివ్వగలిగిన నివాళులు అని వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ చేసూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ. ఈశ్వర రెడ్డి (తిరుపతి):— అధ్యక్షా, ప్రముఖ గాంధేయవాది నివర్తి వెంకట సుబ్బయ్య గారితో నాకు 15 సంవత్సరాలపాటు సన్నిహిత సంబంధం వుంది. వారితో రాయలసీమ సదస్సుకు పోవాలంటే కూడా ప్రొద్దుటూరులో గాని నంద్యాలలో గాని, అనంతపురములో గాని కలసికట్టుగా పనిచేసిన విషయం చిరస్మరణీయంగా వుంది. అటువంటి జాతీయవాది ప్రముఖ గాంధేయవాది నిన్నటి దినము మనందరి మధ్య పెద్దల విషయాలు మాట్లాడుతూ, వివేకానందుడి గురించి చెబుతూ వారు ఆ మైకును పట్టుకొని అలా ఒరిగిపోయింది చూస్తే వారు గతించిపోయారా లేక మనమధ్యలో వున్నారా అనే ఆశ్చర్యం కలుగుతున్నది. వారు తిరుపతి ప్రాంతానికి ఎప్పుడు వచ్చినా నాకు తెలియజేయడం అక్కడ అన్ని విషయాలు కూలంకషంగా మాట్లాడుకోవడం జరిగేది. దేవస్థానపు నిధులన్నింటిని బాలాజీ బ్యాంకు అని ఏర్పాటు చేసి దానిలో వేసుకుంటే బాగుండదా ఈశ్వర రెడ్డి అని ప్రస్తావించేవారు. వారు యీ దినము మనమధ్యలో లేకపోవడం రాయలసీమకే గాదు యావత్తు భారతదేశానికే తీరని లోటు. వారు రాజకీయవాది, జర్నలిస్టు కావడమే గాకుండా వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధిలోకి తీసుకు రావడానికి వారు చేసిన సేవ మరుపురానిది. ఈ విషాద సంఘటన జరిగిన తరువాత వారి కుటుంబానికి వ్యక్తిగతంగా నా సంతాపాన్ని తెలియజేశాను. మా పార్టీ తరఫున వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి ఆత్మకు శాంతి కలుగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. రామచంద్ర రాజు (ఉండి):—అధ్యక్షా, వెంకటసుబ్బయ్యగారి సంతాపస్మరణం ఆంధ్రప్రదేశ్‌లోనేగాకుండా యావత్తు భారతదేశములో ఆయనతో స్వాతంత్ర్య పోరాటములో పాల్గొని యింకా మిగిలినటువంటి స్వాతంత్ర్య సమర యోధులకు చాలా కష్టాన్ని, బాధను కల్గిస్తుంది. కారణం, ఆయన నేను అనేక మంది పెద్దలు ఒకే జైలులో సంవత్సరాలపాటు గడిపాము. ఆయన నాకు సహచరులు, ఆయన, నేను ప్రకాశం గారి అనుచరులుగా వుండి ఎన్నో బాధలు పడ్డాము. ఎన్ని బాధలు పడ్డా వెంకటసుబ్బయ్యగారు నిబ్బరాన్ని కోల్పోకుండా ప్రశాంతంగా మెలిగేవారు. రాజకీయ స్వాతంత్ర్యం దేశానికి వచ్చినా, ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకురావాలని ఎంతో కృషి చేశారు. వారి ఆత్మకు శాంతి కలుగాలని భగవంతుడిని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. వి. చౌదరి: —అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన నివర్తి వెంకటసుబ్బయ్యగారి ఆకస్మిక మరణ సంతాపతీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తూ వెంకటసుబ్బయ్యగారు రాయలసీమ రత్నాలలో ఒకరని చెప్పడానికి ఏ మాత్రం సందేహం లేదని చెబుతున్నాను. వారు గాంధేయవాది. నాటినుండి నేటివరకు గాంధేయ ఆశయాలను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన మహామనిషి. వారు రాజకీయాలలో ప్రవేశించిన నాటినుండి నేటి వరకు రాయలసీమ అభివృద్ధికొరకు ఎంతో ప్రయత్నంచేసి ఎన్నో రాజకీయ మహాసభలు జరిపారు. రాయలసీమ అభివృద్ధి కార్యక్రమాలలో అన్నింటిలో కూడ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి వాటిని సాధించడానికి ప్రయత్నం చేసేవారు. ఆ కార్యక్రమాల గురించి కలుసుకున్నప్పుడు ఎప్పుడూ చర్చించేవారము. అన్నింటికంటే ప్రధానమైనది, కృష్ణా జలాలను రాయలసీమకు తరలించే విషయములో విజయం సాధించకపోతే మనకు వచ్చినటువంటి మహదవకాశం విఫలము అయిపోతుందని చెప్పారు. నిన్నగాక మొన్న నర్సప్పగారి యింట్లో కలిసినప్పుడు ఏ విధంగానైనా కృష్ణా జలాలను రాయలసీమలో నీటి పారుదలకు తీసుకుపోయే అవకాశం కల్పించుకునేదానికి తీవ్రప్రయత్నంచేయాలని చెప్పారు. చేసుకోకపోతే వచ్చినటువంటిఅవకాశాన్ని సద్వినియోగము చేసుకున్నవారము కాదని చెప్పారు. ఆ మహామనిషి యీ దినము లేకపోవడం విచారకరమైనటువంటి విషయము. సర్వశక్తివంతుడైన ఆ పరమేశ్వరుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

* కె. ధనరాజు (ఆచంట):—అధ్యక్షా, పూజ్యులు శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్యగారి అకాల మరణం పట్ల సభానాయకులు ఎంతో ఆవేదనతో ప్రవేశ

పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఎవరైనా పుట్టిన తరువాత గిట్టక పోరనే సామెత ఉంది.

> "జనన మెత్తిన పిదప నేజ్ఞానియైన
> బ్రహ్మ కల్పాంతమగుదాక బ్రతుకగలరె
> మరణమెపుడైన నున్నదే మనకు నెల్ల .. ................" అన్నట్లు

పూజ్యులు అస్తమించడంతో దేశానికే కాక మాబోటి యువకులకు కూడా ఎంతో నష్టంవాటిల్లినదని చెప్పకతప్పదు. అటువంటివారి రాజనీతిని చూసి నేర్చుకోవాలని మేము ఇక్కడకు వచ్చాము. అటువంటి అవకాశం లేకుండా పోయింది. వారు ఎంతోమంది యువకులను నాయకులుగా తయారుచేసినటువంటి మహానుభావులు. అటువంటి కోవకు చెందిన శ్రీ దామోదరం సంజీవయ్యగారు కూడా వారి శిష్యులుగా దేశంలో రాణించారు. కాని అటువంటి వ్యక్తి మనలందరినీ విడిచి పోయారు. వారి మరణంపట్ల దు:ఖసాగరంలో మునిగియున్న వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీమతి సుమిత్రాదేవి (ఇబ్రహీంపట్నం) :— అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్యగారి మరణవార్త విని ఎవరూ నమ్మలేక పోయాము. వారి మరణం పూర్వజన్మ సుకృతం. వారు చాలా మంచివారు. వారు ఒక్క రాయలసీమకే కాదు మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో సేవచేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయడంలో వారు ఎంతో కృషి చేశారు. సోదరభావంతో కలసిమెలసి ఉండేవారు. వారు గాంధేయవాది. వారు చాలా మర్యాదగా, చిరునవ్వుతో మాట్లాడేవారు. ఆడవారితో ఎంతో మర్యాదగా మాట్లాడేవారు. మేము వారి దగ్గరకు వెళితే కూర్చోబెట్టి మర్యాదగా మాట్లాడేవారు. పుట్టినవాడు గిట్టక తప్పదు కాని వారి మంచితనం మిగులుతుంది. ఈ సందర్భంలో వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తు వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలుగజేయు గాక అని ప్రార్థిస్తున్నాను.

శ్రీ కె. బి. నరసప్ప :—అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ ఎన్. వెంకటసుబ్బయ్యగారు నాకు సుమారుగా 30 సంవత్సరాలనుంచి పరిచయం. నేనూ, వారూ ఒకే తాలూకాలో దగ్గరదగ్గర గ్రామాలనుంచి వచ్చినవారం; పుట్టినవారం. నేను కూడా పత్తికొండలో పుట్టాను అని చెప్పేవారు. ఆయన నా గురువుకు గురువు అని చెప్పుకోవడంలో సందేహం లేదు. నా గురువు అయిన శ్రీ దామోదరం సంజీవయ్యగారి గురువు వెంకట సుబ్బయ్య. వారు కర్నూలు జిల్లా కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నప్పుడు నేను వారి క్రింద సెక్రటరీగా పని చేసాను. మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పటినుంచి వారు నాకు ఆప్తులుగా ఉండేవారు. వారి కుటుంబ విషయాలు నాకు తెలుసు. వారి రాజకీయ జీవితంలో వారు ఎన్నో కష్టాలకు

లోను అయినారు. 1942 మూవ్‌మెంట్సులో పాల్గొని పోలీసులకు చిక్కకుండా రాత్రింబవళ్లు ప్రయాణంచేసి మహాత్మాగాంధీగారి దగ్గరకు చేరారు. ఆయన వెంకట సుబ్బయ్యగారిని దగ్గర ఉంచుకొని నా దగ్గర క్షేమంగా ఉన్నాడని వారి కుటుంబానికి ఉత్తరం వ్రాసారు. ఆయన నూటికి నూరు పాళ్లు గాంధేయవాది. ఆయన ఎప్పుడూ నీతి నిజాయితీలు తప్పలేదు. స్వాతంత్ర యోధుడుగా ఆయన పడిన కష్టాలు నాకు బాగా తెలుసు. నిన్నటి మీటింగులో ఆయనకు ఎదురుగా నేను కూర్చున్నాను. ఏవో ఆలోచనలతో బ్లడ్‌ప్రెషర్ ఎక్కువ అయినట్లు ఉంది. వెంటనే గుండె ఆగిపోయినట్లు అయింది, పడిపోయారు. అంతకుముందు రోజున మా ఇంటికి విందుకు వచ్చినప్పుడు ఆహ్వానిస్తూ ఉండగా ఏమి భోజనం తయారు చేయించావు అన్నారు. మీకు ఇష్టమైనటువంటి జొన్న రొట్టె చేయించాను, మీకు స్పెషల్‌గా వంకాయ, ఇంకా వెజిటేరియన్సు అయిటమ్సు చేయించాను అని చెప్పాను. వారు భోజనం చేసిన తరువాత ఇంకా విశేషాలు అడిగారు. శ్రీ సంజీవయ్యగారి గురించి అడిగారు మా కుటుంబ విషయాలు అడిగారు. అటువంటి మహానాయకుడు ఈ రోజున లేరు. ఆయన ఎంతో హాయి అయిన చావు తెచ్చుకున్నాడని సంతోషంగా ఉంది వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని మీ ద్వారా తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ పి. అమ్మిరెడ్డి (అనపర్తి) :—అధ్యక్షా, ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు గాంధేయవాది, నిస్వార్థసేవాతత్పరుడు అయినటువంటి వెంకటసుబ్బయ్యగారి మరణం అందరిని దుఃఖసాగరములో ముంచింది. మరణం అన్నది ఎవరికైనా వస్తుంది. అయితే వారు ఒక సభకు అధ్యక్షత వహిస్తూ ఉభయ సభలకు చెందిన అనేకమంది సమక్షములో సమావేశములో ప్రసంగిస్తున్నప్పుడు ఎటువంటి బాధ లేకుండా వారికి అటువంటి మరణం సంభవించడం ప్రతి ఒక్కరు చెప్పుకోదగిన విషయం. అటువంటి నివర్తి వెంకట సుబ్బయ్యగారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని నా తరఫున, నా నియోజకవర్గ ప్రజల తరఫున తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

شری پی- گنگا ریڈی :- ( نرسل ) محترم جناب خطیب صاحب- ہمیں اس بات کا یقین نہیں ہوتا ہیکہ ہمارے محبوب لیڈر مرحوم وینکٹ سبیا صاحب کو موت کا ظالم پنجہ ہمارے درمیان سے اچانک کھینچ لے گیا ہے - بعض وقت خدا کی مصلحت ہوتی ہے اور ہم سمجھ نہیں پاتے کہ ایسا کیوں ہوتا ہے- کل رات کے استقبالیہ جلسہ میں مرحوم خطاب کرتے ہوئے اچانک دل کا دورہ پڑنے سے وہ ہمیشہ کیلئے ہم سب کو چھوڑ کر چلے گئے- انکے موت سے جو خلیج پیدا ہوتی ہے اس کو پر کرنا ؛ ناممکن ہے- وہ ایک محب وطن، مجاھد آزادی اور اعلی پایہ کے سیاست داں اور رہنما تھے- شاعر نے کہا ہے :

" زندگی کیا ہے عناصر میں ظہور ترتیب،
موت کیا ہے ان ہی اجزاء کا پریشان ہونا "

زندگی اور موت میں کم وقت ہوتا ہے۔ زندگی اور موت میں ایک باریک اور نازک رشتہ ہے۔

ہم نے دیکھا ہے کہ چند ہی لمحوں میں وہ ہم سے جدا ہوگئے۔ یہ قدرتی نظام ہے جو آدمی دنیا میں پیدا ہوتا ہے اس کو ایک نہ ایک دن مرنا ہے۔ لیکن اس طرح کی بےوقت اور اچانک موت ہمارے لئے بے حد تکلیف دہ ہے۔ اور ان کی یاد ہمارے دل میں ہمیشہ ہمیشہ زندہ رہے گی۔ مجھے ان کے ساتھ کام کرنے کا زیادہ وقت نہیں ملا۔ مگر دو، تین ہفتہ کی ملاقات سے انکے خلوص اور ان کا بڑاپن میرے دل پر ہمیشہ کیلئے نقش بنکر رہ گیا ہے۔

میری جانب سے آپ ان کے ارکان خاندان کو یہ پیغام پہنچا دیں کہ ہم آپ کے غم میں شریک ہیں۔

శ్రీ సి. శ్యామలరావు (చీపురుపల్లి) :—అధ్యక్షా, అకళంక దేశభక్తుడు, రాజకీయశమురిధురంధరుడు, నిగర్వి, త్యాగశీల అయినటువంటి నివర్తి వెంకట సుబ్బయ్యగారి ఆకస్మిక మరణం నమ్మలేని నిజం. ఆయన నిర్వహించిన చోటు మనకు తీరని లోటు. అయితే మానవుడు ఊశిస్తాడు మాధవుడు శాసిస్తాడు. జాతస్య మరణం ధ్రువం అన్నారు గనుక పుట్టిన వారికి చావు తప్పదు. నివర్తి వెంకటసుబ్బయ్యగారి చావు ఒక విచిత్రమైన పరిస్థితులలో, విశిష్టమై ఆకస్మికంగా జరగడం ఒక విశేషం. ఎందుకంటే ఏ మహాదాశయాలకోసం, ఏ ప్రజాస్వామ్య విలువల కోసం, ఏ ప్రజాస్వామ్య హక్కులకోసం జీవితాంతం ఆయన పనిచేశారో అటువంటి ప్రజాప్రతినిధుల సభలో వారి అంతిమయాత్ర సాగడం అదృష్టం. అయితే తాము నమ్మిన సిద్ధాంతాన్ని నిర్మొహమాటంగా ఇక్కడ శాసనసభలోగాని అటు ప్రజా సభలలోగాని తెలియజేసి, దానికి విలువలు ఇచ్చిన మహా దేశభక్తుణ్ణి కోల్పోవడం ఎంతైనా విచారకరము. శారీరకంగా వారు మనలో లేకపోవచ్చు ఆంధ్రజాతి చరిత్రలో, భారత జాతి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన జీవితం వారిది, ఆయన మృత జీవి. ఆయన చిరంజీవి. ఆయన చిరస్మరణీయుడు. ఆయనకు నేను జోహారులు అర్పిస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ పరమేశ్వరుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను

శ్రీ కె. ఓబుల్ రెడ్డి :—అధ్యక్షా మహాశయా, మనిషి దుఃఖములో ఉన్నప్పుడు మాటలు రావు. లచ్చన్నగారు కూడా అదే స్థితిలో ఉండి మాట్లాడ లేక పోయారు అలాంటి స్థితిలోనే నేనూ ఉన్నాను. ఈ శాసనసభలో ఉన్న అందరికంటే చిరకాలంగా వారితో నాకు పరిచయము ఉంది. ఘాటిద్దరి

సహచర్యం దాదాపు 45 సంవత్సరాలది. స్వాతంత్ర్య యోధులలో మిగిలి
ఉన్న కొద్దిమందిలో ఒకరిని నిన్న పోగొట్టుకొన్నాము. ప్రకృతి చాలా విచిత్ర
మైంది. అంతకు ముందు రోజు ఒక దేశభక్తుణ్ణి పోగొట్టుకొన్నాము పాపయ్య
గారిని, మరునాటి రోజు మరొక దేశభక్తుణ్ణి పోగొట్టుకొన్నాము చావడం అందరికి
సహజమే అయితే రోగి చావుకంటే యోగి చావు మంచిది. వెంకటసుబ్బయ్య
గారు చనిపోవడం అంటే అదృష్టం మనం అందరం దురదృష్టవంతులం. ఆయన
కుటుంబ సభ్యులు దురదృష్టవంతులు. ఇటువంటి చావు చాలా మందికి లభించదు.
ఆయన సభాపూజ్యుడు. ఆంధ్రదేశంలో ఉన్న పెద్దలందర్ని కలిపి శాసనమండలి
మహాసభ ఏర్పాటు చేశారు. అట్టి కోవిదులతో కూడున్న మహాసభకు ఆయన
అధ్యక్షులు. విన్న ఒక పెద్దమనిషికి ఒక కోవిదుడికి సన్మానం జరుపుతున్న ఆ
సభకు ఆయన అధ్యక్షుడు. అంతకంటే విశిష్టమైంది ఏమంటే తన సన్మానానికి
తానే అధ్యక్షత వహించి చనిపోవడం అనేది ఎంతో మందికి లభించదు. నా
45 సంవత్సరాల రాజకీయ జీవితంలో మాలోటి వారికి దొరకని అవకాశం ఆయనకు
దొరికింది. సేవాగ్రాంలో గాంధీగారితో ఉండి 1942 ఉద్యమంలో పాల్గొన్న
అదృష్టం వారికి దక్కింది. ఏ కోణంనుంచి చూసినా వెంకటసుబ్బయ్యగారు చాలా
అదృష్టవంతులు. 45 సంవత్సరాలుగా ఇద్దరం కలిసి రాయలసీమకే కాకుండా
యావత్ ఆంధ్రదేశానికి సేవచేసిన వారము. ఆంధ్రరాష్ట్రం కావాలని పని
చేసినవాడు. ఆంధ్రప్రదేశ్ కావాలని కూడా పని చేసినవాడు. అనేక రంగాలలో
చాలా పట్టుదలతో పనిచేసిన వాడు పేదవాడైనా మంచిబుద్ధి కలిగి ఉద్యోగం
చేస్తూ కూడా దానికి రాజీనామా ఇచ్చి స్వరాజ్య పోరాటంలో దిగి పెద్దవారి
సంపర్కం పొందే అదృష్టం కలిగింది వారికి. ఆయన ప్రకాశంగారి నాయకత్వం
క్రింద పనిచేశాడు. ఈ కొద్ది సమయంలో ఆయన జీవిత చరిత్రకు న్యాయం
కలుగజేయాలంటే సాధ్యపడదు, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ,
వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. బి. సిద్దయ్య (పుత్తూరు) :—అధ్యక్షా, రెండు మూడు రోజుల
క్రితమే మన సభ్యులు ఒకరు పాపనయ్యగారు మరణించటం విచారంగా ఉన్న
సమయంలోనే నివర్తి వెంకట సుబ్బయ్యగారు నిన్న మన అందరికి మహోపన్యాసం
ఇస్తూ అకస్మాత్తుగా పడిపోవడం, మరణించడం మనకందరకు విచారాన్ని కలుగ
జేసింది. వారు ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే ఒక అకుంఠితమైన స్థానాన్ని
గడించారు. ఎన్నో ప్రజాఉద్యమాలు నడిపి, ఎన్నో బాధ్యతాయుతమైన పదవులు
పొంది రాయలసీమకు ఎంతో గౌరవప్రతిష్ఠలు తెచ్చిన మహానాయకుడు. ఆయన
మరణం రాయలసీమకే కాకుండా మొత్తం ఆంధ్రరాష్ట్రానికే తీరని లోటు, వారి
కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగ
వంతుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. అంకిరెడ్డి (కోయిలకుంట్ల):—అధ్యక్షా, నివర్తి వెంకట సుబ్బయ్యగారి అకాల మరణం పట్ల సభానాయకుడు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానమును బలపరుస్తూ నేను కొన్ని విషయాలు మాట్లాడదలచాను. వారి మరణము చాలా ఉత్కృష్టమైనటువంటిది. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో అంత్య దశలో ఏ భావాలతో ఎవరు మరణించినా అవే భావాలతో పునర్జన్మ ఏర్పడుతుందని చెప్పారు. మన హిందూ సాంప్రదాయం ప్రాకారం మనకు పునర్జన్మ పట్ల నమ్మకం ఉంది. నివర్తి వెంకట సుబ్బయ్యగారు తమ అంత్య దశలో హిందూ సాంప్రదాయాలపైన, సంస్కృతిపైన, వివేకానందుడు, రామకృష్ణపరమహంస మొదలైన మహాత్ముల యొక్క భావాలను గురించి మాట్లాడారు. వారు ఈ మహానుభావుల భావాలను గురించి మాట్లాడుతూ మరణించారు కాబట్టి వారిది ఉత్కృష్టమైన మరణమని చెప్పకతప్పదు. నాకు వారితో విద్యార్థి దశ నుంచి పరిచయము ఉంది. నేను యస్.యస్.ఎల్.సి. చదువుతున్నప్పటి నుంచి నాకు పరిచయము ఉంది. వారు మా కోయిలకుంట్లలో తాలూకా ఆఫీసులో గుమస్తాగా ఉంటూ రాజీనామా ఇచ్చి ప్రజా ఉద్యమములో, ప్రజా సేవలో, స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్నటువంటి మహా వ్యక్తి. ముఖ్యంగా గౌరవనీయులైన కందుల ఓబుల రెడ్డిగారు చెప్పినట్లు—సభ్యులందరికంటె వారు మాకు బాగా తెలుసు-మాకు వారితో ఎక్కువ పరిచయము ఉంది. వారు 1926వ సంవత్సరములోనే కాంగ్రెసు పార్టీ జిల్లా బోర్డు మెంబరుగా ఉండి కరువుకాటకాలతో ఉన్న రాయలసీమ గురించి అప్పటి బ్రిటిషు ప్రభుత్వము వారితోపోరాడి రైతాంగానికి శిస్తు రెమిషన్ కొరకై గ్రామ గ్రామములకుతిరగడం సంభవించింది. వారితోపాటుగా నేనుకూడాతిరిగి కలెక్టరుకు, సబ్ కలెక్టరుకు నివేదికలు సమర్పిస్తూ రైతులకు శిస్తు రెమిషను ఇప్పించడంజరుగుతూ ఉండేది. అంతేగాకుండా ధర్మవల్లె సంస్థానము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కిరీటమైనటువంటిది. అటువంటి చోట శిస్తు 6 మొదలు 8 రూపాయల వరకు ఉండి మిగతా ప్రాంతాలలో 3, 4 రూపాయలు ఉంటే అంతా సమానముగా ఉండాలని అందుకు ప్రయత్నము చేసిన ప్రముఖులు వారని చెప్పకతప్పదు. వ్యక్తిగత సత్యాగ్రహములో మన కందుల ఓబులరెడ్డిగారి ఆధ్వర్యములో వారు పాల్గొన్నారు. అంతే కాకుండా నేను కూడా పాల్గొన్నాను. తరువాత 1974లో క్విట్ ఇండియా మూమెంటు టైములో వారు అండర్ గ్రౌండుకు వెళ్ళడము, స్వాతంత్ర్య ఉద్యమములో పాల్గొని సాధించిన మహా వ్యక్తి ఆయనను స్వాతంత్ర్య యోధుడని కూడా చెప్పకతప్పదు. అటువంటి వారు ఈ నాడు మన మధ్య లేకుండా పోయారంటే, ముఖ్యముగా చెప్పవలసి వస్తే రాయలసీమ ప్రజలకు ఎనలేని లోటు కలిగిందని చెప్పకతప్పదు. వారు ఎప్పుడు చెప్పినా రాయలసీమ అభివృద్ధి గురించే చెప్పేవారు. ప్రతి నిత్యము చెపుతూ వచ్చారు. మన గౌరవనీయ మిత్రులు చౌదరిగారు చెప్పినట్లు రాయలసీమ ప్రాంతము సశ్యస్యామలము కావాలంటే కృష్ణా నది నీరు తప్పకుండా మనము సాధించాలని, అందుకు కృషి చేయాలని పదే పదే చెప్పేడి వారు. వారి ఆత్మకు శాంతి కలగాలంటే వారు ఏ భావముతో మరణించారో ఆ భావమును

మనమందరము ఆచరణలో పెట్టడానికి ప్రయత్నము చేసినప్పుడే వారి ఆత్మకు శాంతి కలుగుతుందని మనవిచేస్తున్నాను. మీదు మిక్కిలి ఇంకొక విషయం ఏమంటే రాజకీయ బాధితులకు పెన్షన్ ఇస్తున్నాము. ఉద్యోగస్తులకు కూడా పెన్షన్ ఇస్తున్నారు. ఉద్యోగస్తులు చనిపోయిన తరువాత వారి కుటుంబాలకు పెన్షన్ ఇస్తున్నారు. రాజకీయ బాధితునిగా వారికి పెన్షన్ 200 రూపాయలు వస్తూ ఉండవచ్చు. అటువంటి సౌకర్యము వారి కుటుంబానికి కల్పిస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేస్తూ మరి నాకు ఈ అవకాశం కల్పించినందుకు అధ్యక్షులవారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వెంకట సుబ్బయ్యగారి కుటుంబానికి సంతాపము తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని చెప్పి దేవుని ప్రార్థిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యస్. వెంకటరత్నం నాయుడు (రాపూరు):—అధ్యక్షా, నివర్తి వెంకట సుబ్బయ్యగారి మరణ సందర్భముగా సభా నాయకులు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానముతో నేను ఏకీభవిస్తున్నాను. వెంకట సుబ్బయ్యగారు నిష్కళంక ప్రజాసేవకుడు, నిరాడంబరమైన దేశభక్తుడు, ప్రముఖ గాంధేయవాది అని చెప్పకతప్పదు. ఆయన నిజంగా ప్రజల మనిషి అనే దానికి నిదర్శనముగా ఆయన నిన్న ప్రజల మధ్యనే చనిపోయారు. ఇంతకు ముందు మరొక శాసన సభ్యుడు శెలవిచ్చినట్లు మన హిందూ సాంప్రదాయ ప్రకారం మనిషి ఏ భావాలతో మరణిస్తాడో తిరిగి వాటికి ప్రతీకగా మరు జన్మలో వారిని భగవంతుడు పుట్టిస్తాడని మీకు కూడా తెలుసు. మన ఇళ్ళలో ఈనాటికి హిందూ సాంప్రదాయం ప్రకారం అవసానదశలో చెవిలో చెప్పడము జరుగుతూ ఉంటుంది. వాటిని ఆ దైవం ఆచరించడం జరుగుతుంది. ఆయన ఏ భావాలు వల్లిస్తూ చనిపోయారో ఆ భావాలతో తిరిగి ఒక గొప్ప సంఘ సంస్కర్తగా ఉదయించి ఈ రాష్ట్రానికి, ఈ దేశానికి సేవచేసి మంచిసంస్కరణలు ప్రవేశపెడతారనే ఆశ, ఆకాంక్ష నాకున్నది. అయితే ఈ రోజు ఆయన లేని లోటు తీర్చడం మాత్రము సాధ్యం కాదని నేను చెప్పకతప్పదు. మన శాసనసభా నాయకుడు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానమును బలపరుస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను,

శ్రీ డి. వెంకటరెడ్డి (తాడిపత్రి):— అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను మనస్ఫూర్తిగా బలపరుస్తూ కొన్ని విషయాలు చెప్ప దలచుకొన్నాను. నివర్తి వెంకటసుబ్బయ్యగారు రాయలసీమ వాసి. వారు రాయలసీమ రైతాంగము కొరకు పాటుపడిన మహావ్యక్తి. ముఖ్యంగా వారు రాయలసీమ డెవలప్‌మెంటు బోర్డు అధ్యక్షులుగా ఉండి రాయలసీమకు సేవ చేసిన మహావ్యక్తి. వారు నిరాడంబరులు. దీక్షా దక్షత కలిగిన మహావ్యక్తి. ఆయన శాసనమండలి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయి ఆరు సంవత్సరాలుగా ఎంతో హుందాతనముతో పనిచేసినటువంటి వారు. వారంటే నాకు చాలా ప్రేమ. రాయలసీమ డెవలప్ మెంట్ బోర్డు అధ్యక్షులుగా ఉన్నప్పుడు నేను వారిని కలుసు

కుంటే వారు ఎప్పుడూ మమ్ములను ఆశీర్వదిస్తూ ఉండేవారు. వారు ఏదయినా పని చేయాలి అనుకున్నప్పుడు దీక్షా దక్షతతో దానిని పరిష్కరించే వారు. వారు చాలా ఉత్తములు. వారి మరణ వార్త నా రూములో విన్నప్పుడు నేను ఎంతో చింతించాను. వారు మరణించడం మన రాయలసీమకే కాక, ఆంధ్ర దేశానికి, మొత్తము భారతదేశానికి తీరనిలోటుని మనవిచేస్తున్నాను. వారు మరణించినందుకు వారి కుటుంబానికి నా సంతాపాన్ని తెలియబరుస్తూ, ముఖ్యంగా వారికి నా ధన్యవాదాలు అర్పిస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.బి. చెన్నమల్లప్ప (రాయదుర్గం) :—అధ్యక్షా, రాయలసీమ ప్రాంతములో అగ్రగణ్యుడుగా, రాజకీయవేత్తగా, ఇక్కడ శాసనమండలిలో చెయిర్‌మెన్‌గా పనిచేసిన నివర్తి వెంకటసుబ్బయ్యగారి మరణవార్త విని నేను దిగ్భ్రాంతి చెందాను. మొన్ననే కె.బి.నరసప్పగారి ఇంటిలో నేను వారిని కలుసుకొని మాట్లాడాను. వారు మాట్లాడే సందర్భంలో రాయలసీమ గురించి, అందులో కృష్ణాజలాలగురించి ఎక్కువగా మాట్లాడారు. అంతకుముందు కూడా నా నియోజకవర్గమైన రాయదుర్గలో ఒక సమావేశములో ఆయన మాట్లాడినమాటలు ఈరోజు నాకు జ్ఞాపకానికి వస్తూ ఉంటే వారు రాయలసీమకు చేసిన సేవ, కేవలం రాయలసీమకే కాకుండా మొత్తము ఆంధ్రదేశానికే చేసిన సేవగాగుర్తుకు వస్తోంది. ఆయన ప్రజాసేవకుడు. అటువంటి వారు మనముందు నుంచి మనల్నందరిని దుఃఖసాగరములో ముంచివేసి వెళ్ళిపోయారు. వీరి యొక్క ఆశయాలను మనము ఎప్పుడయితే ఆచరణలో పెడతామో అప్పుడే వారి ఆత్మకు శాంతి కలుగుతుంది. వారి యొక్క ఆత్మకు శాంతి కలుగజేయాలంటే శాసనసభ్యులందరు కూడా ఆయన ఆశయాలకు తోడ్పడాలని వాటిని ఆచరణలో పెట్టాలని కోరుతూ అప్పుడే వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని మనవిచేస్తూ, వారియొక్క మరణము పట్ల వారికుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సర్వేశ్వరుడు వారి యొక్క ఆత్మకుశాంతి కలిగించాలని ప్రార్థిస్తూ నేను శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ జి. తిమ్మారెడ్డి (ఆళ్ళగడ్డ) :— అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానంతో నేను ఏకీభవిస్తూ, కీ. శే. నివర్తి వెంకటసుబ్బయ్యగారి అకాల మరణానికి నా సంతాపాన్ని వెలిబుచ్చుతున్నాను. వెంకటసుబ్బయ్యగారితో నాకు దాదాపు 40 సంవత్సరాల నుంచీ పరిచయం వుంది. మొట్టమొదట ఆయన రాజకీయ రంగంలో పనిచేస్తున్నప్పుడు, అండర్ గ్రౌండ్‌లో వున్నప్పుడు మాకు ఒక టిన్నర మైళ్ళలో ఆయనను చాలా కాలం వుంచుకున్నాము. అప్పుడు ఆయన ఏవిధంగా జీవించారో మాకు బాగా తెలుసు. చివరికి, కరపత్రం ప్రింట్ చేసి పంపించాలంటే, ఆ పేపర్‌కు కూడా గతిలేని రోజుల్లో ఆయన రాజకీయాలలో కొనసాగారు. ఇప్పుడు కొనసాగే వారిలో ఎంతో ధనవంతులు, బలవంతులు వున్నారు, ఆయన నిరుపేదగా వుండి, ప్రజాసేవలో నిమగ్నమై, కరపత్రానికి పేపర్‌కు 10-10 a. m.

కూడా, సైక్లోస్టయిల్ చేయించాలంటే పేపర్‌కు కూడా చందాలు తీసుకొని ఆ విధంగా రాజకీయ జీవితంలో కొనసాగారు. అప్పటినుంచీ వారితో నాకు ఎంతో సన్నిహిత సంబంధం వుంది. వారికి చాలా కాలం ఎక్కడ కూడా ఇల్లులేదు. ఈ మధ్యనే నంద్యాలలో ఇల్లుకట్టుకున్నారు. జైలుకుపోయినారు కాబట్టి ప్రభుత్వం వారు కొంతభూమి కూడా యిచ్చారు. దానితో ఆయన జీవితం సాగిస్తూవచ్చారు. పెద్ద కుటుంబం. అయిదుగురు పిల్లలు అందులో ఇద్దరికి మాత్రమే పెళ్లిళ్లు అయినవి. మిగతా వారు ఏవిధంగా కొనసాగుతారో తెలియదు. వారితో నాకు ఎంతో సంబంధ బాంధవ్యం వుండేది. అందుచేత నేను ఎక్కువగా మాట్లాడలేను. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు మనశ్శాంతి కలుగజేయ వలసిందిగా కోరుకుంటూ, నాకు యీ అవకాశం యిచ్చినందుకు తమకు హృదయ పూర్వకంగా అభినందనలు తెలుపుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ బి. వెంకటరెడ్డి (నంద్యాల) :— అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్యగారి అకాల మరణానికి నా సంతాపాన్ని తెలియబరుస్తున్నాను వెంకటసుబ్బయ్యగారు నంద్యాల పట్టణములో వుంటున్నారు. నేను కూడా అదే పట్టణములో వుంటున్నాను. వారితో నాకు చాలా పరిచయం వుంది. మేము, రాజకీయంగా విభిన్న అభిప్రాయాలు కలిగివున్నప్పటికి, మామధ్య సత్సంబంధాలు వున్నాయని తెలియబరుచుకుంటున్నాను. వెంకటసుబ్బయ్యగారు పేద కుటుంబంలో పుట్టినారు. వారిది చాలా పెద్ద కుటుంబం, అయిదురుగు కొడుకులు, ముగ్గురు కూతుళ్లువున్నారు. వారిలో ఇద్దరికి మాత్రమే పెళ్లిళ్లు అయినవి. మిగతా వారికిపెండ్లికి యింకా కాలేదు. వారు నాతో ఒకసారి మాట్లాడుతూ—కృష్ణా నదీ జలాల విషయంలో, మనము ఏ పార్టీకి చెందిన వారము అయినప్పటికి, యీ విషయంలో మనమంతా ఒకే త్రాటిపై వుండాలని, కృష్ణా నదీ జలాలు రాయలసీమ ప్రాంతానికి మళ్లించేంతవరకు మనం ఎంతో దీక్షతో పనిచెయ్యాలని, దానికొరకు మనం ఏ త్యాగం చేయడానికయినా వెనుకాడకూడదని వారు చెప్పడం కూడా తటస్థించింది. అంతేకాదు, ఆరు నెలల క్రిందట వారు, తాను అన్ని పార్టీలకూ అతీతంగా వుంటానని ఒక పబ్లిక్ మీటింగులో వాగ్దానం చేశారు అదేవిధంగా, మొన్న ఎలక్షన్సులో కూడా ఆయన అన్ని పార్టీలకూ అతీతంగా వున్నారని నేను మీకు తెలియబరుస్తున్నాను కృష్ణా నదీ జలాలు రాయలసీమకు వచ్చిననాడే వారి ధ్యేయం నెరవేరుతుంది, అప్పుడే వారు కన్న కలలు నెరవేరినట్లవుతుందని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి మా సానుభూతిని తెలియబరుస్తూ, మీరి అవకాశం యిచ్చినందుకు తమకు ధన్యవాదాలు అర్పిస్తూ సెలవుతీసుకుంటున్నాను.

* శ్రీ యస్. ఆర్. టి. పి. యస్, వీరపరాజు (ఏలూరు) :—అధ్యక్షా, మన రాష్ట్ర శాసన పరిషత్ అధ్యక్షులు అయిన వెంకటసుబ్బయ్యగారి నిర్యాణం సందర్భంలో ముఖ్యమంత్రిగారు, గౌ. లచ్చన్నగారు. మా పార్టీ నాయకులు,

గౌ. సభ్యులు ఎల్లరు, వారి తాలూకు గుణగణాలగురించి ప్రసంగించారు. వారందరు ప్రసంగించిన తరువాత, వారి గుణగణాలగురించి ప్రత్యేకంగా నేను ప్రసంగించ వలసిన పని లేదు. అయితే, నా భావాలను వ్యక్తం చేసుకునే నిమిత్తం నేను ప్రసంగించాలని కల్పించుకుని కొద్ది సమయం అవకాశం ఇవ్వవలసిందిగా కోరాను. మీరీ అవకాశం నాకు కల్పించారు మన సుబ్బయ్యగారు, నిన్న రాష్ట్ర మండలి సమావేశంలో, ఆయన మహావ్యక్తుల గురించి ప్రసంగిస్తూ నిర్యాణం చెందడం, దాని తాలూకు అంతర్యం—మానవునికి మరణం వుందిగాని, మానవుని తాలూకు మంచి చెడ్డలకు మరణం లేదని తెలియజేస్తున్నది భర్తృహరి సుభాషితములో చెప్పినట్లుగా—

తే॥గీ॥ కుసుమ గుచ్ఛంబునకుఁబోలె—పొసఁగు శౌర్య
మానవంతుని కివి రెండు—మహిత గతులు
సకల జన మస్తకప్రదే—శములనైన
వనమునందైన జీర్ణ భా—వంబు గనుట.

అన్నది వారి విషయంలో సరిపోతుంది. వారి తాలూకు ఉద్దేశాలను వ్యక్తంచేస్తూ వారు మరణించారు. వారి మరణానికి వారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఛాయాచిత్రాన్ని మన సభాభవనమందు అలంకరించవలసిందిగా ముఖ్యమంత్రిగారికి, మీకు మనవిజేస్తూ నా ఉపన్యాసాన్ని ముగిస్తున్నాను.

శ్రీ యం. సైఫుల్లా బేగ్ (పీలేరు) :—అధ్యక్ష మహాశయా, పూజ్యులు, శాంతమూర్తి శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్యగారి మరణం గురించి విని దిగ్భ్రాంతి చెందాను. వారిగురించి ఏమి మాట్లాడాలో, నాకు నోరు రావడంలేదు. సుమారు 20 సం. ల నుంచి వారు నాకు పరిచయం 1962 లో నేను పోటీచేసి ఓడిపోయి నప్పుడు, శ్రీ సంజీవయ్యగారి యింట్లో, నేను కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయినానే అని కన్నీళ్ళు పెట్టుకున్నప్పుడు వారు ఓదార్చారు. మనం ఎప్పుడూ ధైర్యంగా ఉండాలి; ఎలక్షన్సులో గెలుస్తాము. ఓడిపోతాము ఎప్పుడూ ధైర్యంమాత్రం విడువకూడదు. విపత్తు సంభవించినా, దుఃఖం కలిగే ఏ పరిస్థితి వచ్చినా, ధైర్యం వీడకూడదు. సుఖ దుఃఖాలను ఒకేవిధంగా తీసుకోవలసి వుంటుంది అని వారు నాకు ధైర్యం చెప్పారు. ఎప్పటికయినా తిరిగి గెలుస్తావు అని వారు చెప్పారు. అదే విధంగా, 1972 లో నేను గెలిచిన తరువాత వారివద్దకు వెళ్ళి నమస్కరించాను. సంతోషమొచ్చినా, దుఃఖమొచ్చినా మన ఆప్తులవద్దకు వెళ్లడం మనం చేస్తాం. ఆ విధంగానే నేను వారివద్దకు వెడుతూవుండేవాడిని. కష్టమొచ్చినా, బేగ్ అంతా మన మంచికే వస్తుందని వారు చెప్పేవారు. పెద్దలుగా, పూజ్యులుగా వారెంతో పేరు తెచ్చుకొన్నారు. ఇప్పుడే సుమిత్రాదేవిగారు చెప్పారు—స్త్రీలకు వారు ప్రత్యేకంగా చదువు చెప్పేవారని. అందుచేత, వారి స్మారకార్థం రాయలసీమలో ఎక్కడయినాసరే ఒక స్త్రీల కళాశాలను ఏర్పాటు చేసి, వారి పేరు చిరస్థాయిగా జ్ఞాపకం చేసుకోవడానికి వీలుగా వుంటుంది కాబట్టి, ఆ విధంగా ఏర్పాటు చేయవలసినదిగా నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వారికి 10.20 a.m.

భగవంతుడు వైకుంఠం ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఈ అవకాశం యిచ్చిన మీకు ధన్యవాదాలు అర్పిస్తున్నాను.

శ్రీ ఎస్. ఆళ్వార్ దాస్ (విశాఖపట్టణం-I):—అధ్యక్షా, మొన్ననే గుంటూరు బాపనయ్యగారిని పోగొట్టుకొన్నాము. ఈ రోజు వెంకటసుబ్బయ్యగారిని పోగొట్టుకొన్నాము. కాకలు తీరిన యిద్దరు కర్మయోగులను పోగొట్టుకొన్న వారం యిది. ఈ లోటు ప్రజా జీవితంలో గాని, రాజకీయ రంగంలో గాని తీర్చేది కాదు. వెంకట సుబ్బయ్యగారు స్వాతంత్ర్యానికి పూర్వం ఎంతో నిస్స్వార్థంగా సేవ చేశారో, స్వతంత్రం వచ్చిన తరువాత అంత నిష్కల్మషమైన జీవితాన్ని గడిపారు. అధికారం పాడు చేయని కొద్ది మంది రాజకీయ వేత్తలలో వీరు ఒక వ్యక్తి. కౌన్సిల్ చైర్మన్‌గా, రాజకీయ వేత్తగా, లెజిస్లేటర్‌గా అత్యున్నత స్థానాన్ని పొందిన ఈ ప్రసిద్ధ వ్యక్తి ఒక ప్రాంతానికి చెందిన వారు కాదు, ఒక కులానికి చెందిన వారు కాదు. యావత్ ఆంధ్ర దేశానికి, యావత్ భారత దేశానికి చెందిన వ్యక్తి. వీరి జీవిత చరిత్రలో ఒక పుట ఆకళించుకొని మన జీవితాలను మలచుకొన్నప్పుడు వారికి నివాళులు అర్పించినట్లు అవుతుంది. వీరు క్రొత్త యుగానికి పాత యుగానికి వంతెన. ఆ వంతెన కూలినది అంటే మనం కూలి పోకూడదు. వారి జీవితాన్ని చూసుకొని మనం నిలద్రొక్కుకోవాలి. ప్రజా జీవితాన్ని బాగు చేయాలి. చీఫ్ మినిష్టర్‌గారు ప్రతిపాదించిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేయవలసిందని కోరుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ బి. సీతారామి రెడ్డి (నందికొట్కూరు):—అధ్యక్షా, నివర్తి వెంకట సుబ్బయ్యగారి ఆకస్మిక మరణం యావత్ ఆంధ్ర దేశాన్ని దుఃఖ సముద్రములో ముంచినదని అనడంలో ఎట్టి సందేహం లేదు. నివర్తి వెంకట సుబ్బయ్యగారు కర్నూలు జిల్లాకు చెందిన వారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా రాయలసీమ అభివృద్ధి మండలి అధ్యక్షులుగా, శాసనసభ్యులుగా, శాసన మండలి అధ్యక్షులుగా ఎనలేని సేవ చేశారు. వారితో నాకు ఎక్కువ పరిచయము లేదు. ఈ నెల 16వ తారీఖున వారిని కలుసుకొనే భాగ్యం నాకు లభించినది. వారిని కలుసుకొన్న తరువాత వారి ఆశయాలు, వారి సిద్ధాంతాలు చూస్తే వారు ఒక మహనీయమైన వ్యక్తిగా గోచరించారు. వెంకటసుబ్బయ్యగారు కీ.శే. టంగుటూరి ప్రకాశం పంతులుగారు, పట్టాభి సీతారామయ్యగారు, నీలం సంజీవరెడ్డిగారు వంటి ప్రముఖ రాజకీయ నాయకులతో కలిసి పని చేసిన ప్రజ్ఞాశాలి. రాజనీతి దురంధరులు, నిస్స్వార్థపరుడు. వారు యిటువంటి సమయంలో చనిపోతారని ఎవరూ ఊహించలేదు. అటువంటి మహనీయ వ్యక్తి పోవడం రాయలసీమకే కాకుండా యావత్ ఆంధ్రదేశానికి ఎనలేని లోటు సంభవించినదని చెప్పక తప్పదు. రాయలసీమ పరిశ్రమల రంగం కావాలనే వారి కాంక్ష సఫలం కావాలని తద్వారా వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని కోరుతున్నాను. వారి

కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ నాకు ఈ సావకాశం యిచ్చిన మీకు ధన్యవాదాలు అర్పిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. పాపయ్య (రామన్నపేట) :—అధ్యక్షా, సభానాయకులు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ ఈ వారంలోనే యిద్దరు ప్రజానాయకులు ఒకరి తరువాత ఒకరు కాలధర్మం చెందడము మన ఆంధ్ర రాష్ట్రానికే తీరని లోటు అని మనవి చేస్తున్నాను. నివర్తి వెంకట సుబ్బయ్యగారు పరిపూర్ణమైన రాజకీయ జీవితాన్ని గడిపి అధ్యక్షులుగానే ఆకస్మిక మరణానికి గురి అయి, భగవంతుని సాన్నిధ్య లోకి చేరిపోవడం చాల విచారకరమైన విషయంగా మనవి చేస్తున్నాను. వారు వివిధ పదవులను అలంకరించి, ఆ పదవులలో నిస్వార్థంగా, చాల సమర్థవంతంగా పని చేసి కీర్తి సంపాదించిన వ్యక్తి. తాను ఆదర్శమైన జీవితాన్ని గడిపి ఈనాడు మన అందరికి ఒక ఆదర్శమైన మార్గాన్ని చూపెట్టి ఆ మార్గంలో మనం కూడ నడిచి వారి మాదిరిగానే ఉన్నత పదవులను అలంకరించి నిస్వార్థ ప్రజా సేవ చేస్తూ ప్రజలయొక్క ఆదరాభిమానములను చూరగొనాలని మనవి చేస్తున్నాను. వారియొక్క ఆత్మకు స్వర్గములో శాంతి చేకూరవలెనని కోరుతూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను

శ్రీ కె.ఎ.ఎన్. భుక్త (హరిశ్చంద్రపురం) :—అధ్యక్ష మహాశయా, చాల ఘోరమైన వార్త వినవలసి వచ్చింది. నిన్న హితుడు, సన్నిహితుడు అయిన నివర్తి వెంకట సుబ్బయ్యగారు మరణించారని తెలిసిన తరువాత చాల దిగ్భ్రాంతి, నిశ్చేష్టత కలిగింది నాకు వారితో 6 సంవత్సరాల పరిచయం యున్నది. మాది శ్రీకాకుళం జిల్లా. ఆయనది కర్నూలు జిల్లా అయినా స్వంత కుమారునిలాగా, స్వంత బంధువులాగా 6 సంవత్సరాలు చూసుకొన్నారు. రాయలసీమకు, మా జిల్లాకు ఉన్న సాహిత్యం, అదేవిధమైన పరిస్థితులు మా జిల్లాలో వున్నాయి. అక్కడ కార్యక్రమాలు ఏ విధంగా చేపట్టాలి, ఏ విధంగా నడిపించాలి అని సలహాలు యిస్తూ నాకు చాల తోడ్పడ్డారు. ఈ సంవత్సరం ఎన్నికలలో గెలిచిన వెంటనే మొట్టమొదటి సెలిగ్రాం వారి దగ్గరనుంచి యొచ్చింది. అయినా అది నా యందు వారు చూపించిన విశేషమైన అనురాగం మరచిపోలేకుండా ఉన్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ వి. నారాయణమూర్తి (పెద్దాపురం) :—అధ్యక్షా, నివర్తి వెంకట సుబ్బయ్యగారు నిన్న వారు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మరణించారు. ఆ సందర్భంలో నేను కూడ అక్కడ ఉన్నాను. గొప్ప జాతీయ వాదిగా ప్రసంగిస్తున్న ఆ సభలోనే మరణించడం దురదృష్టం అని భావిస్తున్నాను. వారు యింత ఆకస్మికంగా పోయినందుకు నా ప్రగాఢమైన సంతాపాన్ని తెలియ జేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

10-30 a. m. శ్రీ పోతిన చిన్న (విజయవాడ-పడమర) :— అధ్యక్షా, సభాధ్యక్షులు ప్రవేశపెట్టిన తీర్మానంతో ఏకీభవిస్తున్నాను. శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య గారి అకాల మరణానికి సంతాపం తెలుపుతున్నాను. అవస్థా పూజ్యతే రామ అన్నట్లు మొన్న గుంటూరు బాపనయ్యగారి మరణం తరువాత ఈ సంఘటన జరిగింది. కష్టంలో సుఖం, సుఖంలో కష్టం రాదనే శాస్త్ర ప్రకారంగా వరుసగా కష్టాలే మనకు వస్తున్నట్లు భావించవలసి వస్తున్నది పెద్దలు చనిపోవడాన్ని బట్టి. 1939 ప్రాంతాలలో ప్రకాశం పంతులుగారు, రంగాగారు, కాశీశ్వరరావుగారు, మరుపిళ్ళ చిట్టిగారు విజయవాడలో పోతిన గణపతిరావు పాత్రుడు గారి వద్దకు వచ్చేవారు. అప్పట్లో నేను 15 సంవత్సరాల లోపు వాణ్ని. నాకు వారితో ఎక్కువ పరిచయం కలుగనప్పటికీ ఎప్పటిమంచో అండర్ గ్రౌండులో ఉండేవారిని గురించి చెబుతుండేవారు. అధికారంలో లేనప్పుడు దేశం కోసం అంత త్యాగం చేసిన వ్యక్తి. రెండు రత్నాలు రాలిపోయాయి. వెలుతురు లేకుండా చీకటి కమ్మినట్లు అనిపిస్తున్నది, అలాంటి రత్నాలను తిరిగి సంపాదించుకోలమా అని పిస్తున్నది ఇప్పుడే ఒక మిత్రుడు చెప్పాడు—వారి ఆత్మకు శాంతి కలగాలంటే స్వతంత్ర యోధులకు సహాయం చేయాలి, వెంగళరావు గారి ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా అటువంటి ప్రయత్నం జరిగింది, ఆరు మాసాలకు తక్కువ కాకుండా జైలుకు వెళ్ళిన వారికి పెన్షను ఇస్తున్నారు. అట్లా కాకుండా ఆరు వారాలు కాని ఆఖరుకు ఒక వారం జైలుకు వెళ్ళినప్పటికి దేశ సేవ చేసిన వారికి సహాయం చేయాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. ఆ విధంగా చేసి నివర్తి వెంకటసుబ్బయ్యగారి ఆత్మకు శాంతి కలిగించాలని కోరుతున్నాను. వైకుంఠం లోని 12 ద్వారాలు సంక్రాంతికి తెరుచుకుంటాయట. శ్రీ వెంకటసుబ్బయ్య గారు చిరస్థాయిగా వైకుంఠంలో ఉండాలని కోరుతూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలుపుతున్నాను.

శ్రీ సి.హెచ్. విఠల్ రెడ్డి (నర్సాపూర్) :—అధ్యక్షా, వెంకటసుబ్బయ్య గారి హఠాన్మరణం రాష్ట్రానికి పెద్ద లోటు. వారు జాతీయ వాది. స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యమైన పాత్ర వహించిన దేశభక్తుడు. వారి పట్ల మా నాయకుడు కామ్రేడ్ రాజేశ్వరరావు వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. నేను ఎన్నికయిన మరుసటి రోజున వారు తమ సంతోషాన్ని తెలియచేస్తూ లేఖ వ్రాసారు. వారి మరణానికి నా సానుభూతిని వారి కుటుంబానికి తెలుపుతూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ నీలం భాస్కెను (దెందులూరు) :—అధ్యక్షా, శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్యగారి అకాల మరణం ఆంధ్రదేశం మొత్తం దిగ్భ్రాంతి కలిగించింది. వారు మధ్యనే ఉంటూ మిమిక్రీలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వేణు మాధవ్ గారి గ్రంథాన్ని ఆవిష్కరించే సభలో వారు తమ అమూల్యమైన సందేశాన్ని హాజరైన సభ్యులకు ఇస్తూండగా జరిగిన దుర్ఘటన ఇది. చాలా విచారకరమైన సంగతి

వారు శాసన మండలి అధ్యక్ష పదవిని అలంకరించకముందు వివిధ రంగాలలో అనేక బాధ్యత కలిగిన పదవులను నిర్వహించిన వారు. స్వతంత్ర సమర యోధునిగా యావద్భారత దేశానికి తెలిసిన వారు. వారి అడుగు జాడలతో నడవడం మన కర్తవ్యంగా భావించుకుని సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను.

శ్రీ డి. రవీంద్రనాయక్ (దేవరకొండ) :—అధ్యక్షా, శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్యగారి మరణం మన ఆంధ్ర దేశానికి తీరని లోటు. ఈ విషయమై సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. ఆంధ్ర ప్రదేశ్ లోని గిరిజన ప్రజల తరపున వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియచేస్తూ విరమిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :— శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్య గారు మరణించడ నికి కొన్ని నిముషాల ముందు నేను వా.తో వారి ఛాంబర్సులో మాట్లాడాను. ఎందు వల్లనో వారు తన జీవితంలో జరిగిన ముఖ్యమైన ఘట్టాలను నాకు చెప్పారు తన జిల్లాలోని నాయకుల గురించి చెప్పారు. బొజ్జా వెంకటరెడ్డి గారు, మద్దూరి సుబ్బారెడ్డిగార్ల గురించి చెప్పార. తన కుటుంబ సభ్యుల గురించి చెప్పారు. నేను ఇంత త్వరలోనే మృత్యువు వాత పడతారని ఊహించలేక పోయాను. ప్రశాంతంగా మాట్లాడారు. గ్లాసుతో మంచి నీళ్లు త్రాగారు, ఇద్దరం సంతోషంగా వెళ్లాం. వేదిక మీద కూర్చున్నాము. అందరికి పూల మాలలు వేశారు. ఉపన్యాసం చెప్పడం మొదలు పెట్టారు. అప్పుడు ఉల్లాసంగా ఉన్నారు వారు. భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని సంస్కృతిని ప్రాముఖ్యతను ఉగ్గడిస్తూ భారత దేశానికి చెందిన మహా పురుషు ః వివేకానందులు, రాధాకృష్ణన్ పండితుల గురించి చెబుతూ వారే .ధంగా ప్రప చ లో పేరు పొందారో చెప్పారు. వారు ని డు కు.డవంటి మనిషి. Face is the index of mind. వారి ముఖం చూడగానే నిర్మలమైన చిత్తం, శాంత స్వభావం, గంభీరత ఉట్టిపడుతుంటాయి. 10-40 a. m.
వారు నిజంగా మహాత్మాగాంధీకి అండర్ గ్రాండు మూవుమెంటు అవసరము అని ఒప్పించడానికి వార్ధా వెళ్ళారు. అనేక సార్లు వారిని కలుసుకొని తర్జనభర్జన చేశారు. చివరకు మహాత్మాగాంధీ వీరిని ఒప్పించారు. గాంధీగారు వీరిని హేపీ వారియరు అని ప్రకటించడం జరిగింది. మహాత్మాగాంధీనుండే అటువంటి యోగ్యత పత్రము పొ 'న మహామనీషి వెంకటసుబ్బయ్యగారు. వారు ఎటువ టి క్లిష్టపరిస్థితిలో కూడా తన పట్టు వీడనటువంటి మనిషి. పేద వాడు అయికూడా జీవించడానికి ఉద్యోగం చేసుకుంటూ కూడా ఆ రోజులలో ఉద్యోగానికి రాజీనామా

ఇవ్వడం చాల కష్టం అటువంటి రోజులలో దేశం కొరకు ఉద్యోగం వదులుకొని సర్వత్వం త్యాగం చేసిన మనిషి. ఇపుడు పదవులు వస్తున్నాయిగాని అప్పుడు పదవులు వస్తాయని ఎవరు అనుకున్నారు? బాపనయ్యగారు తరువాత వెంటనే వీరు ఇటువంటి దేశభక్తులు వరుసగా పోవడం మన దురదృష్టం అని నేను భావిస్తున్నాను. నక్షత్రాలు ఒకటొకటే రాలిపోతూ ఉన్నాయి. ఇటువంటి నిష్కల్మషుడైనటువంటి పరోపకార పారాయణుడు అయినటువంటి వ్యక్తి చని పోవడం విచారకరమే అయినా వారు వీరస్వర్గం అలంకరిస్తారని చెప్పవచ్చు. ఒక మహావీరుడు యుద్ధలో చనిపోయి వీరస్వర్గం అలంకరించాలని కోరుకుంటాడు. అటువంటి ఉద్దేశం వారికి ఉంటుంది. అట్లా చనిపోతే స్వర్గం వస్తుందని వారి భావం రామ భక్తుడు రామ నామం జపిస్తూ అట్లానే మహాత్మాగాంధీ హేరామా అంటూ ప్రాణాలు వదిలారు. అట్లానే మన దేశ భక్తుడైనటువంటి వెంకటసుబ్బయ్య గారు కూడా దేశ నాయకుల పేర్లు జపించుకుంటూ వారి నామస్మరణం చేసు కుంటూ ఏ దేశం యొక్క ఔన్నత్యానికి పాటుబడ్డారో ఆ దేశనాయకుల పేర్లను ఉచ్చరిస్తూ ఆనందం పొందుతూ వారు మరణించారు వారి మరణం వారి కుటుంబ సభ్యులకు, మనకు బాధాకరమైనా రామ భక్తుడు రామ నామం జపిస్తూ చనిపోయి నట్లు దేశభక్తుడు దేశాన్ని గురించి చెప్పుకుంటూ చనిపోవడం అనేది ఒక మహా భాగ్యము. వారి ఆశయ సిద్ధికి మనం కూడా వారి వలెనే మన దేశానికి సేవ చేయడంలో ఏత్యాగానికైనా సరే సిద్ధపడాలి. వారు చెప్పిన ఆదర్శాలు మనకు మార్గదర్శకంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. భగవంతుడు తప్పక వారి ఆత్మకు శాంతి కలుగజేస్తాడని నాకు నమ్మకం ఉంది, వారి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నాను. వారు పేదవారు కాబట్టి వారికి తగినటువంటి సహాయం అందచేస్తారని ఆశిస్తున్నాను. సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానంతో సంపూర్ణంగా ఏకీభవిస్తూ సభ్యులు వ్యక్తపరచిన అభిప్రాయాలతో ఏకీభవిస్తు ఈ సందర్భంగా సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అందరు బలపరుస్తారని ఆశి స్తున్నాను. వారి గౌరవ సూచకంగా మనం అందరము రెండు నిమిషాలసేపు నిలబడి మౌనం పాటిద్దాము.

Now, the question is:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Nivarathi Venkata Subbaiah, Chairman of the Andhra Pradesh Lagislative Council and conveys its deep sense of sympathy to the members of the bereaved family."

The resolution was adopted nemcon all members standing.

## ANNOUNCEMENT

**re: Extention of time for withdrawal of nominations to the Committees.**

వారి మరణానికి గౌరవసూచకంగా సభను వాయిదా వేసే ముందు ఒక ఎనున్సొమెంటు చేస్తాను. ఈ రోజు 1.30 పి.యం. లోపల కమిటీలకు చేసిన నామినేషన్స్ విత్ డ్రా చేయవచ్చునని ప్రతిపక్షనాయకులు ప్రస్తావించారు. కాని అది రేపు 1.30 పి.యం. వరకు విత్ డ్రా చేసేదానికి వీలుగా మీరందరు సమ్మతిస్తారని అనుకుంటున్నాను.

వారి పట్ల గౌరసూచకంగా ఈ సమావేశము రేపు ఉదయం 8–30 గంటలకు వాయిదా వేస్తున్నాను.

(The House then adjourned till 8.30 a.m. on Thursday the 30th March, 1978.)